
ప్రజాశక్తి

మంగళవారం 30 ఏప్రిల్ 2024 | 8 పేజీలు



తిరుపతి



చిత్తూరు

ఇండియా ఫోరం గెలుపుతోనే..

తిరుపతి అభివృద్ధి

- బిజెపికి వంతపాడే పార్టీలకు బుద్ధి చెప్పండి
- పి.మురళిని గెలిపించాలని బివి రాఘవులు పిలుపు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

దేశంలో దళిత, మహిళ, మైనార్టీ, గిరిజనులపై దాడులు చేస్తూ, అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న భారతీయ జనతా పార్టీని, దానికి అంట కాగుతున్న వైసిపి ,టిడిపి కూటములను ఓడించాలని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, మాజీ ఎంపి పి.మధు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.హరినాథరెడ్డి పిలుపునిచ్చారు. ఇండియా బ్లాక్ తరపున పోటీ చేస్తున్న సిపిఐ అభ్యర్థి పి.మురళిని గెలిపించాలని సోమవారం తిరుపతి రైల్వేకాలనీ, సుందరయ్యనగర్‌ల్లో ప్రచారం నిర్వహించారు. ప్రచార కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన బివి రాఘవులు, పి.మధు, పి.హరినాథరెడ్డిలకు అభ్యర్థి పి.మురళి ఓ టీ స్టాల్‌లో స్వయంగా టీ కలిపి అందించి ఆకర్షించారు. అనంతరం నేతలు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. రోడ్డుషో కార్యక్రమంలో బివి రాఘవులు మాట్లాడుతూ తిరుపతిలో భక్తులు స్వామివారికి నిలువుదోపిడీ ఇవ్వడం సహజమని, అయితే నేడు అధికార పార్టీ నేతలు టిటిడిని నిలువునా దోచేస్తూ దేవస్థానం నిధులను కైంకర్యం చేస్తున్నారన్నారు.



సిపిఎం, సిపిఐ అధినాయకత్వానికి 'టీ' అందిస్తున్న అభ్యర్థి పి.మురళి

తిరుపతి శుభ్రత కోసం దేవస్థానం నిధులు వెచ్చిస్తుంటే బిజెపి అడ్డు తగలడం, నగర పారిశుధ్యం వద్దనడం వారి విచిత్ర వైఖరికి నిదర్శనమన్నారు. దేశంలో బిజెపి ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేస్తూ, కరోనా కాలంలో కార్మికులకు ఉపాధి లేకుండా చేసిందన్నారు. సిఎఎ పేరున మైనార్టీలో అభద్రతా భావం నెలకొల్పారన్నారు. మణిపూర్‌లో మహిళలను ఊచకోత కోసి దుర్మార్గానికి పాల్పడ్డారన్నారు. రాష్ట్రంలోని టిడిసి, వైసిపిలు గత పదేళ్ళుగా కేంద్రానికి ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ మద్దతిస్తూ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారన్నారు. ప్రత్యేక హోదా మరిచారని, రాజధాని లేకుండా చేశారని, కడప ఉక్కు ఫ్యాక్టరీ, విశాఖ రైల్వేజోన్, చివరకు విశాఖ స్టీలును సైతం అమ్మకానికి పెడుతున్నా ప్రేక్షకపాత్ర వహించారన్నారు. వ్యవసాయానికి మోటార్లు పెడుతున్నారన్నారు. ఈ రాష్ట్రాన్ని రెండు పార్టీలు అధోగతిపాలు చేసి అభివృద్ధిని అడ్డుకుంటున్నాయన్నారు.

2లో

తిరుపతి జిల్లాలో 133 మంది

తిరుపతి అసెంబ్లీకి 46 మంది

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి జిల్లాలో ఏడు అసెంబ్లీలకు 200 మంది నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ సోమవారం పూర్తి కావడంతో ఇప్పటివరకు బరిలో 133 మంది అభ్యర్థులు ఉన్నట్టు జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ ప్రవీణ్ కుమార్ ప్రకటించారు.

గూడూరు	14 మంది
సూళ్లూరుపేట	9 మంది
వెంకటగిరి	10మంది
చంద్రగిరి	24మంది
తిరుపతి	46మంది
శ్రీకాళహస్తి	15మంది
సత్యవేడు	15మంది
తిరుపతి ఎంపి పరిధిలో	23 మంది

ఎన్నికల ప్రచారం వయా సోషల్ మీడియా

సెంటర్‌స్ప్రెడ్‌లో..



అభ్యర్థులతో తిరుపతి జిల్లా ఎన్నికల అధికారి

2-5 తేదీల్లో ...

ఎపిఆర్ సెట్ ప్రవేశ పరీక్షలు : కన్వీనర్

ప్రజాశక్తి - క్యాంపస్ ఏపీ ఆర్ సెట్ 2023-24 ప్రవేశ పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. మే 2 వ తేదీ నుంచి 5 వ తేదీ వరకూ పరీక్షలు నిర్వహించనున్నట్టు ఏపీ ఆర్ సెట్ 2023-24 కన్వీనర్ ప్రొఫెసర్ బి. దేవప్రసాదరాజు తెలిపారు. తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రొఫెసర్ దేవ ప్రసాదరాజు ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ప్రతి రోజూ ఉదయం 9 నుంచి 11 గంటల వరకూ, మధ్యాహ్నం 2.30 గంటల నుంచీ 4.30 గంటల వరకూ రెండు దశలుగా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 10 వ తేదీ నుంచీ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వెబ్ సైట్ నుంచీ హాల్ టికెట్లను విద్యార్థులు పొందవచ్చని సూచించారు. హైదరాబాద్ తో పాటు రాష్ట్రంలోని ఎంపిక చేసిన 17 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయన్నారు. ఈ పరీక్షలకు 10 వేల మందికి పైగా అభ్యర్థులు హాజరయ్యే అవకాశం ఉన్నట్టు చెప్పారు. వేసవి తీవ్రతను దష్టిలో పెట్టుకొని అవసరమైన ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. మే 20 వ తేదీ నాటికి ఫలితాలు వెల్లడించి, జూన్ లో ఇంటర్వ్యూలు చేపడతామని వివరించారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్ కుసుమ హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.



సామాజిక పింఛన్లు నేరుగా అకౌంట్లకు

ఎవరూ సచివాలయాలకు వెళ్లొద్దు : కలెక్టర్లు

ఆధార్ అనుసంధానం కాకపోతే ఇంటివద్దకే

మూడు రోజుల్లోనే 100శాతం పూర్తి చేస్తాం



ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్, తిరుపతి టౌన్

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వద్ధులు, దివ్యాంగుల సంక్షేమం దష్ట్యా మే నెల సామాజిక పింఛన్లను బ్యాంక్ అకౌంట్లు ఉన్న లబ్దిదారులకు డిబిటి ద్వారా వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాలకు నేరుగా జమ చేస్తామని చిత్తూరు జిల్లా కలెక్టర్ ఎస్.షణ్మోహన్ తెలిపారు. సోమవారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో జిల్లాలో మే నెల సామాజిక పెన్షన్ల పంపిణీ పై, ఎలక్షన్ అప్డేట్స్ పై మీడియాతో మాట్లాడారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా వద్ధులు, దివ్యాంగుల సంక్షేమాన్ని దష్టిలో ఉంచుకుని వారికి సహాయపడే విధంగా సచివాలయాలకు రానవసరం లేకుండా ఆధార్ నెంబర్‌తో లింక్ అయిన బ్యాంక్ అకౌంట్లకు పెన్షన్‌లను డిబిటి పద్ధతి ద్వారా నేరుగా జమ చేసేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. చిత్తూరు జిల్లాలో వివిధ పెన్షన్ల కింద మే నెలలో 2,72,864 మంది లబ్దిదారులకు రూ.79.87 కోట్లు పంపిణీ చేయాల్సి ఉండగా, 1,92,021 లబ్దిదారుల బ్యాంక్ అకౌంట్లు ఆధార్ నెంబర్‌తో లింక్ అయి ఉన్నాయని, వీరికి డిబిటి ద్వారా మే ఒకటో తేదిన పెన్షన్ నగదు జమ చేస్తామన్నారు. మిగిలిన 80,843 మందికి సైతం మే 01 వ తేదీనే సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్ పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ పంపిణీ కార్యక్రమం ఎంపిడిఓల ఆధ్వర్యంలో నిర్దేశించిన సచివాలయ పరిధిలో ఆయా సచివాలయ సిబ్బంది ద్వారా చేపట్టడం జరుగుతుందన్నారు. లబ్దిదారులకు ఒకటి కంటే అధికంగా బ్యాంక్ అకౌంట్లు ఉన్న నేపథ్యంలో వారికి పెన్షన్ నగదు జమ చేసిన అనంతరం సంబంధిత బ్యాంక్ నుండి టెక్స్ట్ మెసేజ్ లు అందుతాయని, అలా మెసేజ్ లు అందని నేపథ్యంలో సచివాలయాల వద్దకు వెళ్లి వివరాలు తెలుసుకునే ఏర్పాటు చేయడం జరుగు తుందన్నారు. నగదు పంపిణీలో సాంకేతిక కారణాల ద్వారా బ్యాంక్ అకౌంట్ల కు నగదు జమ కాని పక్షంలో మే 1 వ తేది తరువాత లబ్దిదారుల ఇంటి వద్దకు వెళ్లి నగదు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. పెన్షన్ నగదు విత్ డ్రా చేసుకోవడానికి బ్యాంక్‌ల వద్ద ప్రత్యేక కౌంటర్‌లు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. మే 2 న బ్యాంక్ ఉద్యోగులకు ఎన్నికల విధుల పై శిక్షణ కు హాజరు కానున్న సందర్భంగా వారు బ్యాంక్ ల వద్ద అందుబాటులో ఉండక పోవచ్చునని, మే 3 వ తేదీన పూర్తి అందుబాటులో ఉంటారని ఈ విషయాన్ని లబ్దిదారులు గమనించాలని తెలిపారు.

2లో

(మొదటి పేజీ తరువాయి)

ఇండియా ఫోరం గెలుపుతోనే తిరుపతి అభివృద్ధి

వైసిపి, టిడిపి, బిజెపి, జనసేన ఓటమితోనే రాష్ట్ర భవిష్యత్ ఉంటుందన్నారు. తిరుపతిలో పేదలకు ఇళ్లు, టిటిడిలో కార్మికులకు కనీస వేతనాలు వస్తున్నాయంటే అది కమ్యూనిస్టుల పోరాట ఫలితమేనన్నారు. కార్మిక, పేద ప్రజల సమస్యలపై నిత్యం పోరాడుతున్న పి.మురళిని కంకి-కొడవలి గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ధన రాజకీయాలకు పాల్పడుతూ అడ్డదారిలో పయనిస్తున్న పార్టీలపై తగు చర్యలు తీసుకోకుండా ఎన్నికల సంఘం ప్రేక్షకపాత్ర వహిస్తోందన్నారు. కాంగ్రెస్ అధికార ప్రతినిధి గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ మోడీ ఎన్నికల హామీలను తుంగలో తొక్కారన్నారు. సిపిఐ అభ్యర్థి పి.మురళి మాట్లాడుతూ నిత్యావసర ధరలు పెంచినపుడు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచినపుడు, కరెంట్‌ఛార్జీలు విపరీతంగా బాదినపుడు కమ్యూనిస్టులు మాత్రమే ఉద్యమించారని గుర్తు చేశారు. తనను గెలిపిస్తే తిరుపతి అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ నేతలు ఎ.రామానాయుడు, టి.జనార్ధన్, సి.పెంచలయ్య, జె.విశ్వనాథ్, శివారెడ్డి, కె.రాధాకష్ణ, గురవయ్య, రవి. నదియా, సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, నేతలు కందారపు మురళి, సుబ్రమణ్యం, జయచంద్ర, సాయిలక్ష్మీ పాల్గొన్నారు. ప్రజానాట్యమండలి నేతలు గుర్రప్ప ,నాగరాజు, కాళయ్య, సూరి, తదితరులు డప్పులతో నత్యాలు ప్రదర్శించారు.



'శ్రీవారి లడ్డు గంజాయితో పోలికా..'

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

పవిత్రమైన తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి లడ్డు ప్రసాదాన్ని కించపరుస్తూ గంజాయితో పోల్చిన వారిపై కేసులు నమోదు చేయాలని తిరుపతి నగరపాలక సంస్థ కో ఆప్షన్ సభ్యురాలు రుద్రరాజు శ్రీదేవి కోరారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తిరుపతి నగరంలో గంజాయిని సమూలంగా నిర్మూలించాలని రెండేళ్లకు మునుపు స్థానిక శాసనసభ్యులు భూమన కరుణాకర్ రెడ్డి తన వ్యక్తిగత రక్షణ సిబ్బందిని పక్కనపెట్టి తిరుపతి శివారు ప్రాంతాలలో ఒంటరిగా తిరిగి గంజాయి సేవించే స్థావరాలను గుర్తించి ఆ ప్రాంతాలపై పోలీసులు నిఘా ఉంచాలని చేసిన ప్రయత్నాలు ప్రతిపక్ష పార్టీలకు గుర్తు రాలేదా అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో అధికార పార్టీపై ఏదో ఒక నెపాన్ని నెట్టాలనే ప్రయత్నంలో భాగంగా ఇలాంటి నిరాధార ఆరోపణలు, విమర్శలు చేస్తున్నారన్నారు. చౌక వారు విమర్శలు చేస్తే సహించబోమని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో కార్పొరేటర్ కుమారి, కవిత, రాధా, శైలు పాల్గొన్నారు.

కల్కి ఆక్రమణ భూములను తక్షణం స్వాధీనం చేయాలి

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

వరదయ్యపాలెం లోని కల్కి ఆశ్రమం సూత్రధారి .. కల్కి వెంకటేశ్వర్లు భక్తి ముసుగులో చుట్టుపక్కల ఉన్న రైతుల భూములను ఆక్రమించుకున్నారని .. ఈ భూములను తిరిగి రైతులకు స్వాధీనం చేయాలని హేతువాద సంఘం వ్యవస్థాపకులు నార్నె వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. తిరుపతి ప్రెస్క్లబ్లో సోమవారం మీడియా ముందు డా. ఏ ఆర్ రెడ్డి రైతులు చంద్రశేఖర్ తదితరులతో కలిసి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ కల్కి వేసిన పిటీషన్ను కోర్టు కొట్టేసి 115 రోజులు అవుతున్నా, రైతులకు భూములను స్వాధీనం చేయకపోవడంలో అధికారులు నాటకాలు ఆడుతున్నారని ఆరోపించారు. తక్షణం రైతులకు భూములు స్వాధీనం చేయాలని డిమాండ్ చేశారు.

ల్యాండ్ టైటిల్ యాక్ట్ ప్రజలకు పెనుభూతం: సురేంద్ర నాయుడు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగిస్తూ అది చాలాదన్నట్లుగా ల్యాండ్ టైటిల్ యాక్ట్ ను తీసుకువచ్చిందని, ఇది అమలుకు నోచుకుంటే రాష్ట్ర ప్రజల పాలిట పెనుభూతంగా మారనుందని టిడిపి తిరుపతి పార్లమెంట్ అధికార ప్రతినిధి ఊట్ల సురేంద్ర నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ల్యాండ్ టైటిల్ యాక్ట్ వలన రాష్ట్రంలోని ప్రజల ఆస్తులకు ఎసరు పెట్టడానికి చేసిన కుట్ర అన్నారు. ఈ యాక్టు లోతుగా పరిశీలిస్తే ప్రజలకు సంబంధించిన ఆస్తుల అసలు ధ్రువపత్రాలు ప్రభుత్వం వద్దనే ఉంచబడతాయన్నారు. ఆ పత్రాలను ప్రభుత్వం వారి వద్ద ఉంచుకొని అప్పులు చేసే అవకాశం ఉందన్నారు. ఈ క్రమంలో హక్కుదారుడు తన ఆస్తి అసలు పత్రాలను తనకా పెట్టుకోవడానికి, ఇతర అవసరాలకు ఉపయోగించుకునే పరిస్థితులు ఉండవన్నారు. సి-క్రైసిస్ అనే ప్రైవేట్ సంస్థకు ల్యాండ్ టైటిల్ యాక్ట్ అమలు పనులు వైసిపి ప్రభుత్వం అప్పగించనుందన్నారు. ఇదే జరిగితే ఒక ప్రైవేటు వ్యక్తి చేతిలోకి రాష్ట్ర ప్రజల ఆస్తుల అసలు ధ్రుపత్రాలు వెళ్లిపోతాయన్నారు. ఏదేని వివాదాలు తలెత్తితే పదవీ విరమణ పొందిన ఉన్నతాధికారులను ల్యాండ్ టైటిల్ యాక్ట్ ప్రకారం టీఆర్ఓ అధికారిని నియమించే విధంగా నిబంధనలు తయారు చేశారన్నారు. ఈ టిఆర్ఓ అధికారి ప్రభుత్వ ఆధీనంలో పనిచేస్తూ ప్రజల ఆస్తులకు సంబంధించి ఏదేని వివాదం ఏర్పడితే జిల్లా స్థాయిలో ఆ అధికారి ఇదే అంతిమ నిర్ణయంగా నిబంధనలు రూపొందించారన్నారు. ల్యాండ్ టైటిల్ యాక్టును రాష్ట్రంలోని న్యాయవాదులందరూ ముక్తకంఠంతో నిరసిస్తున్నారని, ప్రజలు కూడా అప్రమత్తంగా ల్యాండ్ టైటిల్ యాక్ట్ ను వ్యతిరేకించాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో శంకర్, వెంకటముని, సాయి, ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

(మొదటి పేజీ తరువాయి)

సామాజిక పింఛన్లు నేరుగా అకౌంట్లకు

పెన్షన్‌ల పంపిణీ పై పూర్తి పర్యవేక్షణ ఉంటుందని, వీలైనంత త్వరగా పెన్షన్ ల పంపిణీ పూర్తి చేయడం జరుగుతుందన్నారు. పెన్షన్ ల పంపిణీ లో ఎటువంటి సమస్యలు, అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

14న గంగజాతర చాటింపు

సాధారణ ఎన్నికలు -2024 నేపథ్యంలో చిత్తూరు పట్టణంలో గంగా జాతర కు మే 14 న చాటింపు, మే 21, 22 న గంగ జాతర నిర్వహణ ఉంటుందని ఈ విషయాన్ని పట్టణ వాసులు, భక్తులు గమనించాలని తెలిపారు.

పక్కాగా సామాజిక పింఛన్ల పంపిణీ : కమిషనర్

నగరపాలక పరిధిలో మే నెలకు సంబంధించి సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పక్కాగా పంపిణీ చేయాలని, ఇందుకోసం వార్డు సచివాలయం స్థాయిలో యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని నగర కమిషనర్ డా. జె అరుణ చెప్పారు. నగరపాలక పరిధిలో మొత్తం 16,627 పెన్షన్లు ఉండగా.. ఇందులో 11,587 పింఛన్లు డీబీటీ ద్వారా, 5,040 పింఛన్లు డోర్ టు డోర్ అందించనున్నట్లు తెలిపారు. ఎవరెవరికి ఏ విధానంలో పంపిణీ చేయాలనే జాబితా క్లస్టర్ వారీగా ఉందని, ఈ జాబితా ప్రకారం లబ్ధిదారులకు కాల్ చేసి వివరాలు తెలియజేసి వారు ఎలాంటి ఆందోళన లేకుండా పింఛన్లు పొందేలా చూడాలన్నారు. సచివాలయల్లో పింఛన్ల జాబితాను ప్రదర్శించాలన్నారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించడానికి ప్రతి 10 వార్డులకు ఒక సూపర్వైజర్ అధికారిని నియమించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో సీఎంఎం గోపి, సీవోలు పాల్గొన్నారు.

పెన్షన్‌దారులు సచివాలయాలకు రావొద్దు : కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

మే ఒకటో తేదీ నుంచి సామాజిక పింఛన్లను ఇంటి వద్దనే జమ చేస్తామని, ఎవరూ సచివాలయాలకు రావొద్దని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. అకౌంట్లు ఆధార్‌తో అనుసంధానం కాకుంటే డైరెక్టుగా సచివాలయ సిబ్బంది ఇంటివద్దకే తెచ్చి ఇస్తారని తెలిపారు. ఈనెల 30నే పింఛన్ నగదును విత్‌డ్రా చేసుకుని సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. వంద శాతం పింఛన్ల పంపిణీ మూడు రోజుల్లో పూర్తి కావాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పథక సంచాలుకులు డి.ఆర్.డి.ఎ ప్రభావతి, డి.ఎల్.డి.ఓ.లు సుశీల దేవి, ఆదిశేషా రెడ్డి పాల్గొన్నారు.

తిరుపతి నగరంలో వద్ధాప్యం వలన మంచానికే పరిమితమైన, దివ్యాంగులు, డయాలసిస్, తలసేమియా ఫించనుదారులు మొత్తము 5215 మందికి సచివాలయ సిబ్బంది ద్వారా మే నెల 1వ తారీఖున ఇంటి వద్దకే ఫించను ఇవ్వడం జరుగుతుందని, అలాగే మిగిలిన 14,242 మంది ఫించనుదారులకు వారి యొక్క ఆధార్ నెంబర్ కు అనుసంధానం అయిన ఖాతాకు జమ చేయడం జరుగుతుందని తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అదితి సింగ్ ఐఏఎస్ సోమవారం ఒక ప్రకటనలో తెలియజేసారు. కావున పై విషయాన్ని గమనించి ఫించనుదారులు సచివాలయం వద్దకు ఎవ్వరూ వెళ్ళరాదని, ఒకవేళ ఫించనుదారు బ్యాంకు ఖాతాకు ఫించను నగదు జమకాని ఎడల సంబంధిత సచివాలయ సిబ్బంది 2, 3 తేదీలలో మీ ఇంటి వద్దకే వచ్చి ఫించను నగదు పంపిణీ చేయడం జరుగుతుందని కమిషనర్ తెలిపారు. ఈనెల 1-5 తేదీల్లో పింఛన్లు పంపిణీ చేస్తామని గూడూరు పురపాలక కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు. మే 1 నుంచి 5వ తేదీలోగా బ్యాంక్ ఖాతా, ఇంటి వద్దకే పింఛన్లు అందిస్తామని శ్రీకాళమస్తి ఎం.పీ.డీ.వో పటాన్ రఫీ ఖాన్ ప్రకటనలో తెలిపారు. మండలంలో మొత్తం 9172 మంది పెన్షన్ లబ్ధిదారులు ఉన్నారని, వారిలో బ్యాంక్ ఖాతా ద్వారా పెన్షన్ అందుకునే లబ్ధిదారులు 6609 మంది, ఇంటి వద్దనే పెన్షన్ అందుకునే లబ్ధిదారులు 2563 మంది ఉన్నారని తెలిపారు.

ఎస్వీయూలో నూతన కోర్సులకు ఆమోదం

ప్రజాశక్తి - క్యాంపస్



శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ అకడమిక్ సెనేట్ సమావేశం సోమవారం ఉదయం 10.30 గంటల నుండి 1 గంట వరకు ఎస్వీయూ ఉపకులపతి ఆచార్య వి. శ్రీకాంత్ రెడ్డి అధ్యక్షతన సెనేట్ హాల్లో నిర్వహించారు. విద్యాపరమైన పలు నిర్ణయాలకు సెనేట్ ఆమోదం తెలిపినట్లు విసి వెల్లడించారు. 2022- 23 విశ్వవిద్యాలయ సంవత్సర నివేదికకు సెనేట్ ఆమోదం తెలిపింది. 2024-25 ఓటాన్ అకౌంట్ బడ్జెట్ కు ఆమోదం తెలిపినట్లు తెలిపారు. నూతన విద్యావిధానంలో భాగంగా ఎస్వీయూ పరిధిలో నిర్వహించబోవు పలు నూతన కోర్సులకు ఆమోదం తెలిపింది. పిజి కోర్సులకు సంబంధించిన సిలబస్ నూతన విద్యావిధానం ప్రకారం పలు మార్పులు చేయడానికి సెనేట్ ఆమోదించింది. ఈ సమావేశంలో పాలకమండలి సభ్యులు ఆచార్య సుగుణమ్మ, ఆచార్య పద్మనాభం, ఆచార్య సుమకిరణ్ , డా.సురేంద్రనాథ్ రెడ్డి, నారాయణ బాబు, రిజిస్ట్రార్ ఆచార్య మహమ్మద్ హుస్సేన్ , ఆచార్య ఎమ్ ఎమ్ నాయుడు పాల్గొన్నారు.

అడ్డదారుల్లో గెలవడానికి ఆరణి కుట్ర: నీలం బాలాజీ

తిరుపతి(మంగళం): ప్రశాంతంగా ఉన్న ఆధ్యాత్మిక క్షేత్రం తిరుపతిలో అడ్డదారుల్లో గెలవడానికి చిత్తూరు నుండి వలస వచ్చిన ఆరణి శ్రీనివాసులు కుట్రలు చేస్తున్నారని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి నీలం బాలాజీ ఆరోపించారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 40ఏళ్లుగా తిరుపతి పుర ప్రజలకు బాగా తెలిసిన వ్యక్తి భూమన కరుణాకర్ రెడ్డి అని, కానీ చిత్తూరు నుండి తిరుపతికి వలస వచ్చిన ఆరణి శ్రీనివాసులు భూమన కరుణాకర్ రెడ్డి గురించి ఇష్టానుసారం విమర్శలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. ఎలాగైనా తిరుపతిలో గెలవడానికి కుయుక్త రాజకీయాలు, విమర్శలు చేస్తూ అల్లర్లు సష్టించడానికి ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. వారే తప్పుచేసి వారే పోలీసులకు, ఎన్నికల అధికారులకు ఫిర్యాదులు చేస్తూ సానుభూతి పొందాలని చూస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది నారాయణ రెడ్డి, లీగల్ సెల్ నాయకులు అజయ్ కుమార్, డాక్టర్ రమణ పాల్గొన్నారు.

'చంద్రబాబుకు 2024లో రాజకీయ సమాధి'

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

చంద్రబాబు తన సభల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని చంపేస్తే తప్పేంటి అనే వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సబబని, 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా పనిచేసిన ఆయన ఇలాంటి వ్యాఖ్యలు చేస్తూ యువతకు, పార్టీ క్యాడర్ కు ఏమి సందేశం ఇస్తున్నారని వైయస్సార్ అభిమాని బొమ్మగుంట రవి ప్రశ్నించారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి స్థానంలో ఉండే వ్యక్తిపై ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు చేసిన చంద్రబాబుకు 2024లో రాజకీయ సమాధి కానున్నారన్నారు. ఇలా నోటికి వచ్చింది మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగకుండా చూడాలని చూస్తున్నారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి వ్యక్తుల నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని కాపాడుకోవాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డిని చేసుకోవాలని ఆ దిశగా ప్రజలు వైసిపి అభ్యర్థులకు అండగా నిలవాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో దాము, తిమ్మారెడ్డి, కుమారి, గురవయ్య పాల్గొన్నారు.

అడవిలో కంటైనర్

ప్రజాశక్తి - బాలాయపల్లి

అడవిలో కంటైనర్ ఉందని పోలీసులకు గ్రామ స్తులు సమాచారం ఇవ్వడంతో ఇటు రెవిన్యూ, అటు పోలీస్ శాఖ అధికారులు పరుగులు తీసిన సంఘటన మండలంలోని నిడిగల్లు గ్రామ పంచాయితీ అడవి సమీపంలోని బోయినగుంట వద్ద చోటు చేసుకుంది. తహసిల్దార్ పుల్లా రావు వివరాల మేరకు... మూడు రోజుల నుంచి కంటైనర్ బోయిన గుంట అటవీ ప్రాంతంలో ఉందని గ్రామస్తులు సమాచారం మేరకు పోలీసులు సహాకారంతో సంఘటన స్థలానికి వెళ్లి కంటైనర్ కి ఉన్న తాళం పగులగొట్టి చూడగా ఖాళీగా ఉంది. కంటైనర్‌ను అడవిలో ఎందుకు ఉంచారు. ఎలక్షన్లకు ఏమైనా నగదు, మందు తరలించారా? అనే కోణంలో విచారిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఐ మహబూబ్ సాహెబ్, ఆర్ ఐ పూర్ణ, విఆర్ఓ శ్రీనివాసులురెడ్డి ఉన్నారు.



అందరికీ అందుబాటులో ఉంటా..ఆదరించండి..

కాంగ్రెస్ అభ్యర్థి కే శ్రీనివాసు

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి): 'కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టండి..దేశాభివృద్ధికి నాంది పలకండి..' అంటూ చంద్రగిరి నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కనుపర్తి శ్రీనివాసులు కోరారు. సోమవారం చంద్రగిరిలోని బీడీ కాలనీ, భారతినగర్, వికలాంగుల కాలనీ, రెడ్డివీధి ప్రాంతాలలో వారు కాంగ్రెస్ నాయకులతో కలసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అందరికీ అందుబాటులో ఉంటానని, ఆదరించి గెలిపిస్తే చంద్రగిరి నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చి దిద్దుతానని తెలిపారు. రాష్ట్రంలో మార్పు రావాలని, కాంగ్రెస్ అధికారంలోకి రావాలనే నినాదంతో విస్తృతంగా ప్రచారం చేశారు. కాంగ్రెస్‌ని ప్రజలు ఆదరించి ఇండియా ఫోరం అభ్యర్థులను గెలిపించాలని కోరారు. చంద్రగిరి నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోని మౌలిక వసతులు అభివృద్ధి చెందాయని తెలిపారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికలలో ప్రతి ఒక్కరూ హస్తం గుర్తుకి ఓటు వేసి నన్ను గెలిపించాలని ఓటర్ల కు ఆయన విజ్ఞప్తి చేశారు . కాంగ్రెస్ మేనిఫెస్టో ను వివరిస్తూ ప్రచారం సాగించారు. ఈ కార్యక్రమంలో చంద్రిక, కోడిదల రాజేంద్ర కుమారి. హసీనా, షణ్ముఖరావు, సురేష్, ఉష పాల్గొన్నారు.

హామీలు ఇచ్చి మోసం చేసిన చెవిరెడ్డి: టిడిపి

ప్రజాశక్తి -రామచంద్రాపురం: చంద్రగిరి నియోజకవర్గ తాజా మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి హామీలు ఇచ్చి ఓట్లు వేయించుకుని రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుచుకొని ప్రజలకను మోసం చేశారని మండల టిడిపి అధ్యక్షుడు ఎం తిరుమలరెడ్డి, కే నరసింహారెడ్డి అన్నారు. సోమవారం టిడిపి ఎన్నికల ప్రచారంలో భాగంగా సి రామాపురం, రాయలచెరువు, వెంకట్రామాపురం గ్రామ పంచాయతీలలో టిడిపి సూపర్ సిక్స్ పథకాలు, బాబు షూ్యరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ లపై విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సి రామాపురంలోని డంపింగ్ యార్డ్ సమస్యపై ((2017లో) గతంలో దొంగ దీక్షలు, హామీలు ఇచ్చి నెరవేర్చకుండా స్థానిక ప్రజలను మోసం చేశారని పేర్కొన్నారు. రాయల చెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని మంత్రి ఆర్కే రోజా, చెవిరెడ్డిలు హామీ చేసి నెరవేర్చలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కె రామిరెడ్డి, కే ముద్దు కృష్ణారెడ్డి, కే గిరిధర్ రెడ్డి, సి రవికుమార్, ధనంజయ రెడ్డి, మాదాసు మాధవయ్య, నాగభూషణం, ఈ ఉమాపతి నాయుడు, నాయకులు కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.

టొయోటా రుమియాన్ కొత్త గ్రేడ్ ఆవిష్కరణ



ప్రజాశక్తి -తిరుపతి సిటీ: టొయోటా కిర్లోస్కర్ మోటర్ (టీకెఎం), అధికారికంగా టొయోటా రూమియన్ కొత్త గ్రేడ్ ఆవిష్కరించినట్లు ఆ సంస్థ వైస్ ప్రసిడెంట్ శబరి మనోహర్ తెలిపారు. ఈ సందర్భంగా అయన విలేకరులతో మాట్లాడుతూ జి-ఏటీ ధరతో పాటు ఈ -సిఎన్ జి బుకింగ్ లను తిరిగి తెరిచామన్నారు. కొత్తగా విడుదల చేసిన జి-ఏటి వేరియంట్ దాని సాటిలేని స్థలం, సౌకర్యం, అద్భుతమైన ఇంధన సామర్థ్యం, ఆకర్షణీయమైన ప్రీమియం, బాహ్య డిజైన్‌తో రూమియాన్ మార్కెట్ ఆమోదాన్ని మరింత పెంచుతుందని భావిస్తున్నా మన్నారు. ఈ వాహనాలు ఎక్స్-షోరూమ్ ధర రూ. 13,00,000తో మే 5 నుండి డెలివరిలు ప్రారంభమవుతాయని తెలిపారు. వినియోగదారు లు రూ. 11,000 బుకింగ్ రుసుంతో ఏదైనాఅధీకృత డీలర్‌షిపలలో ఆన్‌లైన్‌లో వాహనాన్ని బుక్ చేసుకోవచ్చని తెలిపారు. వినియోగదారుల సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ముగ్గురు అరెస్ట్, కారు, రెండు బైక్‌లు సీజ్

ప్రజాశక్తి - రామకుప్పం:

కర్ణాటక నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యంను కుప్పం డీఎస్పీ శ్రీనాథ్ ఆధ్వర్యంలో రామకుప్పం పోలీసులు పట్టుకున్నారు. చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఉత్తర్వుల మేరకు కుప్పం సబ్ డివిజన్ డీఎస్పీ శ్రీనాథ్ సమాచారం మేరకు కుప్పం రూరల్ సీఐ ఈశ్వర్ రెడ్డి సూచనలతో సోమవారం మండల పరిధిలోని సంతమిట్ట క్రాస్, విజలాపురం వద్ద రామకుప్పం ఎస్సై శివకుమార్ తమ సిబ్బంది తో కలిసి కర్ణాటక మద్యంను పట్టుకున్నారు. అక్రమంగా కర్ణాటక మద్యాన్ని రాజుపేట్ రోడ్ లోనీ వేణు బార్ అండ్ రెస్టారెంట్ మేనేజర్ నితీష్ కుమార్ గౌడ సాయంతో రవాణా చేస్తున్న కుప్పం మండలం కొత్తపల్లి గ్రమానికి చెందిన వరప్రసాద్, పైపాల్యం గ్రామానికి చెందిన శ్యామరాజ్ అనే ఇద్దరు నిందితులు, వేణు బార్ అండ్ రెస్టారెంట్ మేనేజర్ ను అరెస్టు చేసి, మద్యం రవాణా కు ఉపయోగించిన ఒక కారును, రెండు ద్విచక్ర వాహనాలను, 2,880 లీటర్ల కర్ణాటక మద్యాన్ని, సుమారు 5 లక్షల విలువగల సొత్తును స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కి పంపామని తెలిపారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన పోలీస్ సిబ్బంది హరి, మురుగేశ్, మంజునాథ్ రెడ్డి , వరప్రసాద్ కు డీఎస్పీ చేతుల మీదుగా రివార్డ్ అందించారు.

మోసగించిన కేసులో వ్యక్తికి జైలు

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్:

మోసగించిన కేసులో నిందితుడికి జైలు శిక్ష పడ్డట్టు సీఐ లక్ష్మణ లక్ష్మయ్య తెలిపారు. 2022వ సంవత్సరం బంగారుపాలెం మండల కేంద్రంలో నెహ్రూ వీధిలో గండికోట ఆంజనేయులు అలియాస్ సాయినాథ్ చౌదరి పలువురి ద్వారా ఆరు కోట్ల 55 లక్షల రూపాయలు చీటీల రూపంతో మోసగించి పరారయ్యాడు. మోసపోయిన నీలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా నిందితుల్ని అరెస్ట్ చేసి జైలుకు పంపామని తెలిపారు. కేసు విచారణలో దాదాపు 60 మంది సాక్షులను విచారించి నిందితునికి 9 సంవత్సరాలు జైలు శిక్ష రూ.1,50,000 జరిమానా విధించారని పోలీసులు తెలిపారు. నిందితున్ని చిత్తూరు సబ్ జైలుకు తరలించారు.

శ్రీకాళహస్తిని అభివృద్ధిలో అగ్రగామిగా నిలబెడతాం

బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి



మ్యానిఫెస్టోను విడుదల చేస్తున్న బొజ్జల సుధీర్‌రెడ్డి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: తనకు ఎమ్మెల్యేగా ఒక అవకాశం ఇస్తే తన తండ్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డిలా శ్రీకాళహస్తిని అభివృద్ధిలో అగ్రగామిగా నిలబెడతానని టిడిపి కూటమి అభ్యర్థి బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి హామీ ఇచ్చారు. శ్రీకాళహస్తి పట్టణంలోని ఎన్టీఆర్ భవన్‌లో సోమవారం ఆయన తన ఎన్నికల మ్యానిఫెస్టోను విడుదల చేశారు. ఈ మ్యాని ఫెస్టోలో ప్రధానంగా పక్కా ఇళ్ళు, శ్రీకాళహస్తీశ్వర ఆలయం, యువత ఉపాధి, వ్యవసాయం, మౌలిక వసతులు అంశాలు చేర్చారు. ఈ సందర్భంగా బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వస్తే శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పేదలకు 40వేల నుంచి 50వేల పక్కా ఇళ్లతో పాటు అవసరమైన వారికి ఇంటి స్థలం అందిస్తామన్నారు. తన తండ్రి బొజ్జల గోపాలకృష్ణా రెడ్డి ప్రారంభించిన శ్రీకాళహస్తీశ్వర ఆలయ మాస్టర్ ప్లాన్‌ను పూర్తి చేసే బాధ్యత తీసుకుంటా మన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ పరిధిలోని గుడిమల్లం, తొండమనాడు, శ్రీకాళహస్తి ఆలయాలను కలుపుతూ టెంపుల్ టూరిజం సర్క్యూట్ అభివృద్ధి చేస్తామన్నారు. శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో స్థానికులకు ఉచితంగా ప్రత్యేక దర్శనాలు కల్పించేలా చర్యలు చేపడతామన్నారు. శ్రీకాళహస్తికి తలమాని కమైన శ్రీకాళహస్తీశ్వర ఇన్ స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (స్కిట్) ఇంజనీరింగ్ కళాశాలను పునఃప్రారం భించి అనంతపురం జేఎన్‌టీయూకి అనుసంధానం చేస్తామన్నారు. శ్రీకాళహస్తి నియోజవర్గంలో వైద్య కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. రేణిగుంట మండలం, శ్రీకాళహస్తి పట్టణంలో స్కిల్ డెవలప్ మెంట్ కేంద్రాలు ఏర్పాటు చేసి స్థానిక పరిశ్రమలతో అనుసంధానం చేస్తామని హామీ ఇచ్చారు. పరిశ్రమల్లో స్థానిక యువతకు ఉద్యోగాల్లో 33శాతం రిజర్వేషన్ కల్పించేందుకు చర్యలు చేపడతామని, మండలానికో ఎంఎస్‌ఎంఈ ఏర్పాటు చేసి మహిళల ఉపాధికి కృషి చేస్తామని తెలిపారు. పంటలకు స్టోరేజీ గొడౌన్లు ప్రతి మండలంలో నిర్మించేందుకు కృషి చేస్తా మన్నారు. బొజ్జల గోపాలకృష్ణా రెడ్డి ప్రారంభించిన సోమశిల-స్వర్ణముఖి అనుసంధాన కాలువ, బాలాజీ రిజర్వాయర్ పూర్తి చేస్తామన్నారు. శ్రీకాళహస్తీశ్వర ఆలయ మాస్టర్ ప్లాన్ లో భాగంగా స్వర్ణముఖినదిని ప్రక్షాళన చేసి సుందరీకరణకు చర్యలు చేపడతామన్నారు. స్థానిక కన్నలి కాలువ సమస్యను పరిష్కరించి, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటుకు ప్రయత్నిస్తా మన్నారు. మెకానిక్ పని చేసే వారికి స్థలం కేటాయించడంతో పాటు ఆటో నగర్ ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు. అవసరమైన యూనియన్లకు 20 సెంట్లు స్థలాన్ని అందిస్తామని బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు చెంచయ్య నాయుడు, శోభన్ నాయుడు, గోపినాథ్, సుబ్బయ్య, కోబాకు లక్ష్మణ్ పాల్గొన్నారు.

జనసేన ఆధ్వర్యంలో ప్రచారం

ప్రజాశక్తి -శ్రీకాళహస్తి : రానున్న ఎన్నికల్లో టిడిపి కూటమిలోని ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించుకుంటేనే రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి సాధిస్తుందని శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి వినుత కోటా పిలుపు నిచ్చారు. సోమవారం వినుత ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణంలోని ముత్యాలమ్మ గుడి వీధి, జెట్టి పాలెం, నెహ్రూ వీధిలో పర్యటించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యే, తిరుపతి ఎంపీ స్థానాలకు కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు తోట గణేష్, జనసేన-టీడీపీ నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు పాల్గొన్నారు.

సత్యవేడు: ఎమ్మెల్యే అభ్యర్థి పర్యటన సమయంలో గ్రామంలో ఉన్న సమస్యలను ఎమ్మెల్యే అభ్యర్థి దృష్టికి తీసుకురావడంతో సానుకూలంగా స్పందిస్తూ ఎమ్మెల్యే గెలిచిన వెంటనే తాను, తన స్నేహితుడు తిరుపతి ఎంపీ అభ్యర్థి గురుమూర్తిని కలుపుకొని సమస్యలను పరిష్కరిస్తానని గ్రామ ప్రజలకు హామీ ఇచ్చారు.

సంక్షేమ ప్రదాత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి : చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

ప్రజాశక్తి - క్యాంపస్:

'ఐదేళ్లలో చంద్రగిరి నియోజకవర్గం రూపురేఖలు మారాయి.. సుమారు రూ.900 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం.. ప్రతి ప్రాంతంలో కొత్తగా మౌలిక సదుపాయాలు సమకూరాయి.. దశాబ్దాల నాటి సమస్యలు పరిష్కారానికి నోచుకున్నాయి..' అని తుడా ఛైర్మన్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం తిరుపతి రూరల్ మండలం పరిధిలోని పేరూరు, వేంకటపతి నగర్ పంచాయతీలలో మన ఊరికి - మన మోహిత్ కార్యక్రమం నిర్వహించారు. రెండు పంచాయతీలలో యువత బైక్ ర్యాలీతో ఆకట్టుకున్నారు. చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సైతం బైక్ నడిపి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పేరూరు పంచాయతీలో భారీ గజమాలను క్రేన్ ద్వారా మోహిత్ రెడ్డికి వేసి సత్కరించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రతి ఇంటా మోహిత్ రెడ్డికి అపూర్వ ఆదరణ లభించింది. ఈ క్రమంలో పబ్లిక్ మీటింగ్ లో చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా చెవిరెడ్డి మోహిత్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఇంటా 'నవరత్న' పథకాల వెలుగులు విరాజిల్లాయన్నారు. సీఎం జగనన్న విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు. పేదింటి పిల్లల చదువుకునే ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య, ఆహారం అత్యుత్తమంగా ఉండేలా చర్యలు చేపట్టారన్నారు. పిల్లలు ధరించే యూనిఫాం మొదలు పుస్తకాల వరకు అన్నీ సమకూర్చారన్నారు. అక్కచెల్లెమ్మల కుటుంబాల ఖాతాల్లోకి సంక్షేమ నిధులు పారదర్శకంగా జమ చేశారన్నారు. లంచాలు, వివక్షకు తావులేకుండా ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అందాయన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com
చిత్తూరు - తిరుపతి
మంగళవారం 30
ఏప్రిల్ 2024



సార్వత్రిక రణభేరి

సంక్షేమ పథకాలు వైసీపీతోనే సాధ్యం: నారాయణస్వామి



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: సంక్షేమ పథకాలు వైసీపీతోనే సాధ్యమని, మరోసారి వైసీపీని గెలిపించాలని డిప్యూటీ సీఎం నారాయణస్వామి పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని తూగుండ్రం పంచాయతీలోని పలు గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డిప్యూటీ సీఎం నారాయణస్వామి మాట్లాడుతూ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైసిపి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావాలని అన్నారు. సీఎం జగన్ రాష్ట్ర అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారన్నారు. ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మిని గెలిపించాలని కోరారు. ఫ్యాను గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో నాయకులు పూర్ణచంద్రారెడ్డి, బాబు, వాణిశ్రీ కేశవులు, రాజేంద్రరెడ్డి, లోకనాథ్ యాదవ్, ప్రభాకర్ రెడ్డి, జాన్ సుందరం, చిట్టి బాబు, ఇప్తుకర్అల్లి, అల్తాఫ్, యేసు, అన్వర్, వేలు పాల్గొన్నారు.

టీడీపీతోనే గ్రామాభివృద్ధి: థామస్

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండలంలోని ఆత్మకూరు, ఎల్లాపల్లి, కడపగుంట పంచాయతీలో మండల టీడీపీ అధ్యక్షుడు స్వామిదాస్ ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సైకిల్ గుర్తుకు ఓటేసి ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే థామస్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. టీడీపీ ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ మ్యానిఫెస్టోతో పేదలకు మేలు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కృష్ణమనాయుడు, శ్రీధర్‌యాదవ్, దేవ సుందరం, జ్యోతియాదవ్, మోహన్‌నాయుడు, ప్రకాష్, చిన్న, రాజా, చిదంబరం, షణ్ముగం, ఆర్ముగం, స్టాండ్లీ, గజేంద్ర నాయుడు పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్

చిత్తూరు పార్లమెంట్ బరిలో 19 మంది

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్

సాధారణ ఎన్నికలు - 2024లో భాగంగా నామినేషన్ల విత్ డ్రా గడువు ముగిసిందని, చిత్తూరు పార్లమెంట్ కు సంబంధించి 19 మంది ఎన్నికల బరిలో నిలవనున్నారని తెలిపారు. ప్రతి బ్యాలెట్ యూనిట్ లో ఒక ఈ వి ఎం కు 16 మంది అభ్యర్థులు, రెండవ ఈ వి ఎం కు ముగ్గురు అభ్యర్థులు, ఒక నోటా ఉండనుందని తెలిపారు. అబ్జర్వర్లు, పొలిటికల్ పార్టీల సమక్షంలో ఎన్నికల విధి నిర్వహణకు పోలింగ్ పార్టీ లను తయారు చేయడం జరిగిందని, ఇందులో ఒక గెజిటెడ్ ఆఫీసర్, ఒక సూపర్వైజర్, నలుగురు సహాయక సిబ్బంది మొత్తం 6 మంది ఉండనున్నారన్నారు. జిల్లాలో 1,771 పోలింగ్ స్టేషన్ లకు 1,771 పోలింగ్ పార్టీ లను ఏర్పాటు చేయడం జరిగిందని, ఇందులో నగరి, వడమాలపేట మండలాలలోని పోలింగ్ స్టేషన్లకు సంబంధించి పోలింగ్ పార్టీలను తిరుపతి జిల్లా నుండి కేటాయించడం జరుగుతుందన్నారు. మే 11 న పోలింగ్ పార్టీ లకు పోలింగ్ స్టేషన్ కేటాయింపు జరుగుతుందన్నారు. పోలింగ్ విధుల్లో పాల్గొంటున్న ప్రతి ఉద్యోగికీ పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించడం జరుగుతుందని, చిత్తూరు జిల్లాలో ఎన్నికల విధులు నిర్వహించనున్న 16,547 మంది పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకోగా వీరిలో 11,914 మంది చిత్తూరు జిల్లాలో ఓటు హక్కు కలిగి ఉన్నారని, 4,633 మంది ఇతర జిల్లాలో ఓటు హక్కు కలిగిన వారుగా ఉన్నారన్నారు. చిత్తూరు జిల్లాలో ఓటు హక్కు కలిగిన వారికి మే 05న సంబంధిత నియోజకవర్గంలో, ఇతర జిల్లాల్లో ఓటు హక్కు కలిగిన వారు జిల్లా కేంద్రం లో తమ పోస్టల్ బ్యాలెట్ ను వినియోగించుకోవడానికి అవకాశం కల్పిస్తామన్నారు. మే 02వ తేది నుండి ఎన్నికల సామగ్రిని పూర్తి స్థాయిలో సిద్ధం చేసుకోవడం జరుగుతుందని, 3, 4 వ తేదిలలో పి ఓ లు, ఏపిఓ లకు నియోజకవర్గ స్థాయిలో శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరుగుతుంద న్నారు. జిల్లాలో 596 మంది ఇంటి నుండే తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారని ఈ కార్యక్రమం 6, 7 తేదీలలో చేపట్టడం జరుగుతుంద న్నారు. మే 1 వ తేది నుండి ఓటర్ స్లిప్ ల పంపిణీ కార్యక్రమం జరుగుతుందన్నారు. సి-విజిల్ యాప్ ద్వారా అందిన ఫిర్యాదులు అందిన వంద నిముషాల వ్యవధిలో స్పందించడం జరుగుతుందని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో శిక్షణ కలెక్టర్ డి. హిమ వంశీ, డిఆర్ఓ బి.పుల్లయ్య పాల్గొన్నారు

వరప్రసాదరావును అనర్హుడిగా ప్రకటించాలి: ప్రదీప్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి పార్లమెంటు నియోజకవర్గం నుండి బిజెపి పార్టీ ఎంపీ అభ్యర్థిగా ఉన్న మాజీ ఐఏఎస్ అధికారి వరప్రసాదరావును అనర్హుడిగా ప్రకటించాలని ఎస్సీ ఎస్టీ పొలిటికల్ జేఏసీ నాయకులు మించల ప్రదీప్ డిమాండ్ చేశారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2014 లోను ఆయన అభ్యర్థిత్వంపై కారుమంచి జయరాం ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేసారన్నారు. నిజమైన ఎస్సీ ఎస్టీలు తమ రిజర్వేషన్లు కోల్పోవడానికి ఇలా నకిలీ కుల ధ్రువీకరణ పత్రాలు సమర్పించి ఎంపీగా ఎన్నికవుతున్నారన్నారు. ఒక ఐఏఎస్ అధికారి అయి ఉండి ఇలా నకిలీ కుల ధ్రువపత్రాన్ని సమర్పించి ప్రజాప్రతినిధిగా కొనసాగడం సిగ్గుచేటు అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో డాక్టర్ మురళీకష్ణ, దుగ్గాన్ని జయరాం పాల్గొన్నారు.

అరవింద్ కంటి ఆస్పత్రిలో 'ఆరోగ్యశ్రీ' తనిఖీలు



ప్రజాశక్తి -తిరుపతి సిటీ

ఆరోగ్యశ్రీ సీఈఓ డాక్టర్ జి. లక్ష్మిశ తిరుపతిలోని అరవింద్ కంటి ఆసుపత్రిని సోమవారం తనిఖీ చేసి, ఆరోగ్యశ్రీ సేవలు ఎలా అందుతున్నాయో రోగులను అడిగి తెలుసుకున్నారు. రోగులు అందరూ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్యం అందుతుందని సీఈఓకి తెలియజేసారు. సీఈఓ మాట్లాడుతూ ఉచిత వైద్యం ప్రతి ఆరోగ్యశ్రీ లబ్ధిదారునికి అందించాలని, నాణ్యమైన భోజనం ఆసుపత్రులలో వసతులు, ఆరోగ్య శ్రీ ఆసుపత్రుల యాజమాన్యం అందించాలని, ఆరోగ్య మిత్రాలు ఆరోగ్య శ్రీ హెల్ప్ డెస్క్ లో అందుబాటు లో ఉండి, ఆరోగ్యశ్రీ సేవల గురించి రోగులకు వివరించి ఉచిత వైద్యం అందే విధంగా ఆరోగ్యశ్రీ కి వారధిగా పని చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆరోగ్యశ్రీ సమన్వయ కర్త రాజశేఖర్ రెడ్డి, జిల్లా మేనేజర్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కార్యాలయంలో సోదాలు

ప్రజాశక్తి చిత్తూరుఅర్బన్: వైసీపీ నుండి చిత్తూరు అసెంబ్లి అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎంసి విజయనందరెడ్డి కార్యాలయంలో మహిళా డిప్యూటీ కలెక్టర్ నేతృత్వంలో సోదాలు నిర్వహించారు. వైకాపా కార్యాలయం తలుపులు మూసి వేసి నిర్వహించిన సోదాల్లో అనధికారికంగా ఉన్న 6 లక్షల 50 వేల రూపాయలు అధికార్లు సీజ్ చేశారు. పార్టీల ముఖ్య నేతలు పోటీ చేస్తున్న అభ్యర్థుల నివాసాలపై నిర్వహిస్తున్న సోదాల్లో భాగంగా సాధారణ సోదాలు నిర్వహించిన్నట్లు అధికార్లు తెలిపారు. ఈ సోదాల్లో డిప్యూటీ కలెక్టర్‌తో పాటు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

తిరుమలలో జనసేన ఇంటింటి ప్రచారం



ప్రజాశక్తి-తిరుమల: తిరుమలలో జనసేన అభ్యర్థి ఆరని శ్రీనివాసులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఆయనకు తిరుమల వాసులు బ్రహ్మరథం పలికారు. టిటిడి నిబంధనలకు అనుగుణంగా పార్టీ చిహ్నాలు, పార్టీ కండువాలు లేకుండా టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు ప్రచారం చేశారు. తిరుమల బాలాజీ నగర్, ఆర్.బి సెంటర్ వద్ద ప్రచారం నిర్వహించి తిరుపతి ఎమ్మెల్యేగా ఆరనిని, ఎంపీగా వరప్రసాద్‌రావును గెలిపించాలని కోరారు. కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీనివాసుని సన్నిధిలో ప్రచారం మహా భాగ్యమని, ఐదు ఏళ్ళలో తిరుమలను వైసీపీ కలుషితం చేశారని ఆరోపించారు. దర్శనాల పేరుతో భక్తులను దోచుకుంటున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక భక్తులకు సౌకర్యవంతంగా దర్శనాలు చేయిస్తామన్నారు. ఇది వరకు ఉన్న స్థానికుల దర్శనాలను పునరుద్ధరణ చేసి మంగళవారం దర్శన భాగ్యం కల్పిస్తామని కూటమి అభ్యర్థి ఆరని శ్రీనివాసులు తెలిపారు. వైసీపీ పాలనలో మంచి చేశామని తిరుపతి ప్రజలను మోసం చేశారని, ఎమ్మెల్యే తనయుడు అభినయ్ రెడ్డి గెలుపు కోసం టీటీడీ నిధులను భూమన కరుణాకరరెడ్డి వాడారని టీడీపీ తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ అన్నారు. ఐదు సంవత్సరాలకు ఖర్చు అయ్యే టిటిడి నిధులను భూమన టీటీడీ ఛైర్మన్ అయ్యాక మూడు సమావేశాలకు మంజూరు చేశారని ఆరోపించారు. తిరుమలలో అనధికార దుకాణాలపై జరిగిన అక్రమాలపై టిడిపి వచ్చాక క్షేత్ర స్థాయిలో విచారణ చేయిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి పనబాక లక్ష్మీ, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, నర్సింహయాదవ్, మందలపు మోహన్ రావు, జెబి శ్రీనివాసు, కోడూరు బాలసుబ్రమణ్యం, వూకా విజయ్ కుమార్, శ్రీధర్ వర్మ, కందాటి సురేష్, చినబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారం వయా సోషల్ మీడియా..



ప్రజాశక్తి-డక్కిలి: మరో రెండు వారాల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలోనే ప్రజలను తమవైపు ఆకర్షించేందుకు అధికార, ప్రతిపక్ష పార్టీలు ప్రచార వేడిని పెంచాయి. ఇందులో సామాజిక మాధ్యమాలు, సోషల్ మీడియాదీ కీలక పాత్ర. గతంలో ఓట్ల కోసం కరపత్రాల పంపిణీ, సభల నిర్వహణ, గడప గడపకూ వెళ్లి ఓటర్లను కలవడం ఇలా సాగేది ప్రచారం. ఇప్పుడు పంథా మారిపోయింది. సామాన్యులకి సైతం సెల్ ఫోను అందుబాటులోకి వచ్చేసింది. వాట్సప్, ఫేస్బుక్ , ఇన్ స్టాగ్రామ్, యూట్యూబ్ వినియోగం పల్లెలకు సైతం పాకింది. రాజకీయ పార్టీలకు సోషల్ మీడియా ప్రధాన ప్రచార మాధ్యమంగా మారిపోయింది. గత ఎన్నికలతో పోలిస్తే 2024 ఎన్నికల ప్రచారంలో సోషల్ మీడియాకు అన్ని పార్టీలు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాయి. ఎక్కువగా వాట్సఅప్ గ్రూపులు ఫేస్బుక్ అకౌంట్లు ఉంటే సులువుగా ప్రజలకు చేరువ కావచ్చునని నిర్ణయానికి వచ్చేసాయి. అన్ని పార్టీలు సోషల్ మీడియా వేదికగా తమ అభ్యర్థి ప్రచారవీడియోలు, విభిన్నమైన పాటలతో తయారుచేసిన షార్ట్ వీడియోలతో హోరెత్తిస్తున్నాయి.

సెల్ ఫోన్ కాల్ ప్రచారాలతో విసిగిపోతున్న జనం

ప్రతి ఒక్కరి చేతిలో సెల్ఫోన్లు అందుబాటులోకి రావడంతో వీటినే అభ్యర్థులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. సమయం సందర్భం లేకుండా, రాత్రి అపరాత్రి అన్నా తేడా లేకుండా ఫోన్లు రింగ్ అవుతున్నాయి. ఫోన్ రింగ్ కాగానే ఎవరూ ఏ పనుల్లో ఉన్నా ఫోన్ను లిఫ్ట్ చేయడం జరుగుతోంది. తీరా అవతల నుంచి వినిపించే వ్యాఖ్యలు తమ అభ్యర్థికి ఓట్లు వేయాలి, తమ పార్టీ అధినేత మీతో మాట్లాడతారు అంటూ ప్రజలను అభ్యర్థిస్తున్నారు. సమయపాలన లేకుండా ఫోన్లు రింగ్ అవడంతో ప్రజలు ఓటర్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు ద్విచక్ర వాహనాలపై వెళ్తున్నప్పుడు, విరామ సమయంలో, రాత్రి సమయం అని తేడా లేకుండా ప్రధాన పార్టీలకు చెందిన సోషల్ మీడియా సంస్థలు అదేపనిగా ప్రచారాన్ని సాగిస్తున్నాయి. వెంకటగిరి నియోజకవర్గంలో టిడిపి బిజెపి జనసేన ఉమ్మడి అభ్యర్థి అయిన కురుగొండ్ల రామకృష్ణ కు మద్దతుగా టిడిపి అధినేత చంద్రబాబు మీతో మాట్లాడతారంటూ, నారా భువనేశ్వరి మాట్లాడతారని తరచు ఈ ప్రాంత ప్రజలకు రికార్డింగ్ ఫోన్ కాల్ వాయిసులు వస్తున్నాయి. వైసిపి అభ్యర్థి నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డికి మద్దతుగా గతంలో మీరు ఏ పార్టీకి ఓటు వేశారని , ఈ ఐదేళ్లలో ఏ ఏ సంక్షేమ పథకాలు మీకు అందాయని, ఈ దఫా మీరు ఎవరికి ఓటేస్తారని తరచూ కాల్స్ వస్తున్నాయి. ఇరు పార్టీల అభ్యర్థులకు సంబంధించి ఫేస్బుక్లో ఓటింగులు నిర్వహించడం పరిపాటిగా మారింది.

వైసీపీ ప్రచారంలో ఉద్రిక్తత

- ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌ను అడ్డుకున్న వేపనపల్లి గ్రామస్తులు
- ప్రచారానికి రావొద్దంటూ అడ్డగింత
- బనాయించిన అక్రమ కేసులు గుర్తులేవా అంటు విమర్శలు
- పోలీసుల జోక్యంతో శాంతించిన గ్రామస్తులు



గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి-పూతలపట్టు: పూతలపట్టు నియోజకవర్గం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్ కుమార్ సోమవారం నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. మండలంలోని వేపనపల్లి గ్రామానికి చెందిన పలువురు గ్రామస్తులు సునీల్‌కుమార్‌ను అడ్డుకున్నారు. ఆసరా పథకానికి సంబంధించి డబ్బులు రాలేదని.. గతంలో తమ గ్రామంలోని కొందరిపై వైసీపీ నాయకులు అక్రమ కేసులు బనాయించారని ఆరోపిస్తూ వారు మా గ్రామంలోకి వస్తే ఒప్పుకోబోమని నిరసనకు దిగారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని వారికి సర్ది చెప్పారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్ ద్వారా ఫోనులో ప్రచారానికి అడ్డు తగల రాదని గ్రామస్తులతో మాట్లాడించారు. దీంతో శాంతించిన గ్రామస్తులు తమ గడపల వద్దకు ప్రచారానికి రాకూడదని డిమాండ్ చేశారు. కలుగజేసుకున్న డీఎస్పీ వైసీపీ అభ్యర్థి 'మీ ఇంటికి రావడం ఇష్టం లేకుంటే తలుపులు వేసుకోండి' అంతేగాని ప్రజాస్వామ్యబద్ధంగా ప్రచారాన్ని అడ్డుకునే హక్కు మీకు లేదని వాదించడంతో గ్రామస్తులు నిరసన విరమించి వెళ్లిపోయారు. అనంతరం సునీల్ కుమార్ గ్రామంలో తమ పార్టీకి సంబంధించిన కుటుంబాలకు వెళ్లి కరపత్రాలను అందజేసి ఓటు వేయాలని కోరారు. అనంతరం సునీల్ కుమార్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఇలా ప్రచారాన్ని అడ్డుకోవడం విచారకరమన్నారు. తాము కూడా ఎలాంటి ఘర్షణలకు చోటు లేకుండా శాంతియుతంగా ప్రచారం చేసి వెను తిరగడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జెడ్పిటిసి దేవిక, ఆ పార్టీ నాయకులు జగదీశ్వర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, రాజరత్నం రెడ్డి, కో ఆప్షన్ నెంబర్ ఖాదరవల్లి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ వారు నవరంధ్రాలను పీకేస్తారు

హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ



ప్రజాశక్తి -చిత్తూరుడెస్క్: 'వైకాపా వారు నవరత్నాల పేరుతో నవరంధ్రాలను పీకేస్తారు' అని హిందూపురం ఎమ్మెల్యే బాలకష్ణ అన్నారు. సోమవారం బంగారుపాళ్యం మండల కేంద్రంలో స్వర్ణాంధ్ర సాధన యాత్ర కార్యక్రమం మండల అధ్యక్షులు జయప్రకాశ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీని నందమూరి తారక రామారావు ప్రారంభించారని, ప్రారంభించిన వెంటనే బడుగు బలహీన వర్గాల అభివద్ధి కోసం సంక్షేమ పథకాలు ప్రారంభించి అప్పటినుండి ఇప్పటివరకు ఎవరు ముఖ్యమంత్రి అయిన సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలను ప్రారంభించిన ఘనత నందమూరి తారకరామారావు కే దక్కుతుందన్నారు. దళితులు వెనుకబడిన కులాల వారిని గుర్తించి వారికి అవసరమైన పనిముట్లు పంపిణీ చేసి కులవత్తులను అభివద్ధి చేసిన ఘనత తెలుగుదేశంకి దక్కుతుందన్నారు. చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ తో ఎన్నికల మ్యానిఫెస్టో తెస్తున్నారని అందులో తల్లికి వందనం, రైతులకు భరోసా, దీపం గ్యాస్ సిలిండర్లు ఉచితంగా మూడు, 18 సంవత్సరాల దాటిన యువతకు ఆసరా పథకాలతో తెలుగుదేశం అధికారం చేపట్టబోతుందని, జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పని అయిపోయిందన్నారు. రాబోవు ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి దగ్గుమల్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్, మాజీ ఏఎంసి చైర్మన్ జయచంద్ర నాయుడు, నాయకులు సందీప్, ధరణి, ప్రకాష్ నాయుడు, లత పాల్గొన్నారు.

సదుంలో టెన్షన్.. టెన్షన్..

- రామచంద్రాయాదవ్, అతని అనుచరులపై పెద్దిరెడ్డి అనుచరుల దాడి
- బీసీవైపీ ప్రచార వాహనాలు ధ్వంసం
- ఎర్రాతివారిపల్లిలో ఘటన
- సదుం పోలీస్‌స్టేషన్‌లో విచారణ చేపట్టిన జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు



ప్రజాశక్తి-తిరుపతి బ్యూరో: భారత చైతన్య యువజన పార్టీ అధినేత రామచంద్రాయాదవ్, అతని అనుచరులపై సోమవారం పెద్దిరెడ్డి అనుచరులు దాడికి పాల్పడ్డారు. పలువాహనాలకు నిప్పంటించారు. కర్రలు, రాళ్లతో వాహనాలను విచక్షణా రహితంగా ధ్వంసం చేశారు. వివరాల్లోకి వెళితే.. బైసీపీ అధినేత రామచంద్రాయాదవ్ పుంగనూరు బరిలో నుంచి పోటీ చేస్తున్న విషయం విధితమే.. గత కొన్ని రోజులుగా పుంగనూరు నియోజకవర్గంలో ఆయన విస్తృతంగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. సోమవారం ప్రచార కార్యక్రమంలో భాగంగా రామచంద్రాయాదవ్ అతని కార్యకర్తలతో కలిసి ముందుగా అనుకున్న షెడ్యూల్ ప్రకారం సదుం మండలంలో పర్యటించారు. ప్రచారంలో భాగంగా మంత్రి పెద్దిరెడ్డి స్వగ్రామం ఎర్రాతివారిపల్లికి చేరుకున్నారు. ప్రచారంలో ఉన్న బీసీవైపీ కార్యకర్తలు, పెద్దిరెడ్డి మనుషులకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఆగ్రహించిన పెద్దిరెడ్డి అనుచరులు రామచంద్రాయాదవ్, అతనికి సంబంధించి కాన్వయ్, ప్రచార వాహనాలను ధ్వంసం చేశారు. బీసీవైపీ కార్యకర్తలపై దాడికి పాల్పడ్డారు. కొంతమంది పారిపోయేందుకు ప్రయత్నించినా వెంటాడి మరీ దాడి చేశారు. వాహనాలకు నిప్పంటించారు. బీసీవైపీ అధినేత రామచంద్రాయాదవ్‌ను ఆయన వ్యక్తిగత సిబ్బంది తీవ్ర ప్రయత్నం చేసి అక్కడి నుంచి తప్పించి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. స్టేషన్‌లో ఉన్న బీసీవైపీ కార్యకర్తలను, స్టేషన్ ఎదుటే ఉన్న ప్రచార వాహనాన్ని సైతం పెద్దిరెడ్డి అనుచరులు ధ్వంసం చేశారు. స్టేషన్‌లో ఆశ్రయం పొందిన రామచంద్రాయాదవ్‌ను పోలీసుల సమక్షంలోనే బూతులు తిడుతూ చెప్పులు విసిరారు. అతనికి సంబంధించిన కార్యకర్తలు ఇద్దరు కనిపించడం లేదని బీసీవై పార్టీ నేతలు చెబుతున్నారు. మరొకరి చేతికి ఫ్యాక్చర్ అయిందని తెలిపారు. సంఘటనకు సంబంధించి సమాచారం అందుకున్న జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు సోమవారం సాయంత్రం సదుం పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. ఘటనకు సంబంధించి విచారణ చేపట్టారు.

మేడే నిర్వహణకు అనుమతించండి: సిఐటియు


వినతిపత్రం అందించిన సిఐటియు నాయకులు

ప్రజాశక్తి -సత్యవేడు: అంతర్జాతీయ కార్మిక దినోత్సవం నిర్వహణకు అనుమతి ఇవ్వాలని సత్యవేడు రిటర్నింగ్ అధికారి నరసింహులు, డిఎస్‌పి కి సిఐటియు నాయకులు సోమవారం వినతిపత్రం అందించారు. సత్యవేడు రిటర్నింగ్ అధికారి నరసింహులు మాట్లాడుతూ అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని ఎన్నికల నిబంధనలకు లోబడి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా నిర్వహించుకోవాలని తెలిపారు. సత్యవేడు సిఐటియు డివిజన్ కార్యదర్శి మెలుగు రమేష్ మాట్లాడుతూ మే 1వ తేదీ సత్యవేడు నియోజకవర్గంలోని కెవిబిపురం, సత్యవేడు, వరదయ్యపాలెం, నాగలాపురం, పిచ్చాటూరు, బుచ్చినాయుడు కండ్రిగ, నారాయణవనం మండల హెడ్ క్వార్టర్స్‌లలో ఎన్నికల నిబంధనలకు లోబడి నిర్వహించుకునేందుకు మేడేని సిఐటియు అనుబంధ సంస్థలు కార్మికుల దినోత్సవాన్ని నిర్వహించాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు దాసరి జనార్దన్ , సిఐటియు కార్యకర్తలు పాల్గొన్నారు.


ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న చెవిరెడ్డి లక్ష్మి

చెవిరెడ్డి లక్ష్మి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-యర్రావారిపాలెం: రానున్న ఎన్నికల్లో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరుతూ చెవిరెడ్డి లక్ష్మి ఎర్రావారిపాలెం పంచాయతీలో సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులతో మమేకమై చెవిరెడ్డి లక్ష్మి పార్టీ కరపత్రాలు పంచుతూ చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని మీ బిడ్డగా భావించి రానున్న ఎన్నికల్లో గెలిపించి చంద్రగిరి ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని కోరారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా చెవిరెడ్డి కుటుంబం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మండలంలో చేసిన అభివృద్ధిని చూసి మోహిత్ రెడ్డిని గెలిపించాలని కోరారు.

వైసిపి నుంచి టిడిపిలోకి వలసలు

ప్రజాశక్తి-తిరుపతి డెస్క్: యర్రావారిపాలెం మండలంలోని కూరపర్తివారిపల్లి పంచాయతీ నుండి వైసిపికి చెందిన 25 కుటుంబాల వారు సోమవారం టిడిపిలో చేరారు. చంద్రగిరి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని నివాసంలో వైసిపికి చెందిన వార్డు మెంబర్లు, మాజీ సర్పంచ్, కార్యకర్తలతో సహా 50 మందికి పైగా పులివర్తి నాని కండువాలు కప్పి టిడిపిలోకి ఆహ్వానించారు. పార్టీలోకి వచ్చిన ప్రతి ఒక్కరికి గుర్తింపు, గౌరవం ఇచ్చి వారి అభివృద్ధికి దోహదపడతానని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఓట్లు వేసి గెలిపించాలని నాని పిలుపు నిచ్చారు. సమన్వయంతో పార్టీ గెలుపు కోసం కృషి చేస్తామని పార్టీలో చేరిన కార్యకర్తలు పేర్కొన్నారు. టిడిపిలో చేరిన వారిలో సుధాకర్, మాజీ సర్పంచ్, గుణకల గీత, వార్డు మెంబర్, పల్లం మణి వార్డు మెంబర్, వెంకట్రమణ, సూరి, ఆకుల ప్రసాద్, దొరస్వామి, రామ్మోహన్, నారాయణ, చంద్ర వున్నారు.

దళితుల ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని టిడిపి కార్యాలయంలో దళితుల ఆత్మీయ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర ఎస్‌సి నాయకులు జెన్ని రమణయ్య మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఎక్కువగా కష్టపడింది దళితులే అని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక దళితుల పైనే దాడులు జరిగాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో దళితులపైన జరుగుతున్న దాడులు, హత్యలు, అత్యాచారాలను వ్యతిరేకిస్తూ ఈ రాష్ట్రంలో దళితులకు ఎలా అన్యాయం జరుగుతుందనే విషయంపై దళితులకు అవగాహన కల్పించారు. ఈ ఎన్నికల్లో గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా డాక్టర్ పాశం సునీల్ కుమార్‌ని, ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడుని గెలిపించాలని కోరారు. సైకో పాలన నుంచి మన రాష్ట్రాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోను శివకుమార్ , డాక్టర్ శ్రీ పతి బాబూ , ఏసుపాక పెంచలయ్య, పల్లి కోటేశ్వర రావు, మాతంగి వెంకటయ్య పాల్గొన్నారు.

ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాలలో టెక్నో-24



బహుమతులు అందుకున్న విద్యార్థులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): డిగ్రీ విద్యార్థుల్లో కంప్యూటర్ సైన్స్ కోర్సుల ద్వారా మంచి ఉపాధి అవకాశాలు లభించడానికి విద్యార్థులకు మరింత నైపుణ్యతను పెంపొందించడానికి టెక్నో- 24 కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాల డైరెక్టర్లు గిరిధర్, విశ్వనాథ్ తెలిపారు. సోమవారం ఆ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ కోర్సు అభ్యసిస్తున్న ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సర విద్యార్థులకు టెక్నో-24 అనే వినూత్న కార్యక్రమంలో కోడ్ రన్నర్, బ్లైండ్ ప్రోగ్రామింగ్, కోడ్ జగల్, ఫ్లకాట్, కోడ్ డాజల్, డి బగ్గింగ్ వంటి వాటిలో పోటీలను నిర్వహించామన్నారు. కోడ్ డాజల్ లో ప్రథమ స్థానంలో దేవి, బిందు, దాక్షాయిని, ద్వితీయ స్థానంలో ఇందు, లక్ష్మీ సృజన, ప్రీతి, కోడ్ రన్నర్ లో ప్రథమ స్థానంలో భాను ప్రకాష్, శ్రీనివాసులు, ఇంద్ర వర్షిత్, ద్వితీయ స్థానంలో వంశీ, మారుతి, గణేష్, ఫ్లక్కాట్ లో ప్రథమ స్థానంలో షారోన్, జయశ్రీ, చైతన్య లక్ష్మి, ద్వితీయ స్థానంలో విష్ణువర్ధన్, పూర్ణచంద్ర, సాయి విగ్నేష్, కోడ్ జగల్ లో ప్రథమ స్థానంలో ప్రత్యూష, సాయి శ్రీజ, జాహ్నవి, ద్వితీయ స్థానంలో ఇ.జాహ్నవి, శ్రావణి, సంధ్య, డి బగ్గింగ్ లో ప్రథమ స్థానంలో జాహ్నవి, జ్ఞాన ప్రియ, ఐషా విజేతలుగా నిలిచారన్నారు. వీరందరికీ కళాశాల డైరెక్టర్లు బహుమతులు ప్రదానం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపసంచాలకులు మునిరత్నం, ప్రిన్సిపాల్ జాఫర్ వల్లి, నరసింహ, శ్రీనివాసులు, చేతన్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, ఈశ్వర్, రమేష్, నాగవేణి పాల్గొన్నారు.

దూదేకుల సంక్షేమాన్ని కోరే జగన్‌కే మద్దతు: షేక్ సయ్యద్ బాజీ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్ర వ్యాప్తంగా నూర్ బాషా దూదేకుల సామాజిక వర్గానికి చెందినవారు అనాదిగా హేళనను ఎదుర్కొనే వారమని సీఎం జగన్‌మోహన్ రెడ్డికి ఈ సమస్యకు పరిష్కారం చూపుతూ జీవో నెంబర్ 20ని విడుదల చేశారని రాష్ట్ర నూర్ బాషా, దూదేకుల ముస్లిం మైనారిటీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్ సయ్యద్ బాజీ తెలిపారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దూదేకుల పిల్లలు పదవ తరగతి టీసీల్లో ఇండియన్ హిందూ దూదేకుల అని ఇస్తున్నారని, దీన్ని ఇండియన్ ముస్లిం దూదేకుల అని విద్యాశాఖ అధికారులు ఇచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి ఎన్నికల అనంతరం తీసుకెళ్లనున్నామన్నారు. ముస్లింలకు ఇచ్చిన నాలుగు శాతం రిజర్వేషన్లను బిజెపి అధికారంలోకి వస్తే తీసివేస్తుందని, ఆ బిజెపికి అంటగాగే పార్టీలను ప్రజలు విజ్ఞతతో ఆలోచించి ఓటు ఆయుధంతో తరిమికొట్టాలన్నారు. ఈ సమావేశంలో అమీర్ బాషా, కరీంభాషా, ఖదీర్ బాషా, ఇబ్రహీం, నజీర్ బాషా, సిలార్ బాషా, రియాజ్ బాషా పాల్గొన్నారు.

చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యం: గాలి భాను



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడమే అందరి లక్ష్యం అని నగరి నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్ పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా పుత్తూరు మండలంలోని తడుకు పంచాయతీ, తిమ్మరాజులు కండ్రిగ, దిగువ గూళూరు, రామకృష్ణాపురం, తొర్రూరు గోపాల కృష్ణాపురం, నేషనూర్, గట్టు వడ్డిండ్లు, గ్రామాల్లో చిత్తూరు పార్లమెంటరీ టిడిపి ఉపాధ్యక్షులు గంజి మాధవయ్య, టిడిపి నాయకులు అమ్ములు ఏలుమలై, రవి శేఖర్ రాజుతో కలిసి ఆయన సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టిడిపి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్‌ను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా భాను ప్రకాష్ మాట్లాడుతూ రాష్ట్రం, పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలన్నారు. జగన్‌మోహన్ రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలు, వ్యవస్థలు అణిచివేతకు గురయ్యాయని, ఈ ఎన్నికల్లో మంచి నాయకుడిని ఎన్నుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో. తడుకు సర్పంచ్ బొబ్బిలి యాదవ్, రూరల్ అధ్యక్షులు రవికుమార్, యువకులు మహిళలు పాల్గొన్నారు.

మరో సారి ఆశీర్వదించండి: ఎమ్మెల్యే బియ్యపు


ప్రజా ఆశీర్వాద పాదయాత్రలో పాల్గొన్న మధుసూదన్‌రెడ్డి

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి రూరల్: 2014 ఎన్నికల్లో ఓటర్ల ఆశీర్వాదంతో ఎమ్మెల్యేగా గెలిచానని 2024 సార్వత్రిక ఎన్నికల్లోనూ మరోసారి ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపించాలని బియ్యపు మధుసూదన్ రెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. మండలంలోని ఎగువవీధి పంచాయతీలో సోమవారం ప్రజా ఆశీర్వాద పాదయాత్ర చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు భారీ గజమాలలతో, మేళ తాళాలతో ఆహ్వానించారు. అనంతరం ఆయన ప్రతి గడపకు వెళ్లి తనకు ఓటు వేసి ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడచిన ఐదు సంవత్సరాలలో ప్రజాక్షేత్రంలో ఉంటూ అనునిత్యం ప్రజా సేవకుడుగా సేవలు అందించానని గుర్తు చేశారు. ఎవరికి ఎలాంటి కష్టం వచ్చినా తాను ఎప్పుడూ స్పందిస్తానని తెలిపారు. కరోనా కష్టకాలంలో తాను తప్ప మరి ఎవరూ నియోజకవర్గ ప్రజలను పట్టించుకోలేదని, కొత్తగా ఇప్పుడు కొంతమంది వచ్చి ఓట్లు అడగడం విడ్డూరం అన్నారు. ఈ కార్యక్రమంలో బ్రి హేమభూషణ్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, వడ్లతంగల్ బాలాజీ, వయ్యాల కృష్ణారెడ్డి, పాడి చంద్ర, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపి అభ్యర్థి ప్రచారం


ప్రచారం నిర్వహిస్తున్న ఆదిమూలం

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: సత్యవేడు నియోజకవర్గం బుచ్చినాయుడుకండ్రిగ మండల పరిధిలో టిడిపి మండల అధ్యక్షుడు సుధాకర్ నాయుడు, క్లస్టర్ ఇన్‌ఛార్జి కన్నయ నాయుడు , మాజీ జెడ్పిటిసి సునీత సుధాకర్ నాయుడు ఆధ్వర్యంలో సోమవారం ఎన్టీఆర్ నగరం నుండి ప్రచారం ప్రారంభించారు. నియోజక వర్గంలో టిడిపి కూటమి అభ్యర్థి ఆదిమూలం జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆ గ్రామంలో టిడిపి నాయుకులు, గ్రామస్థులు వారికి ఘన స్వాగతం పలికారు. ఇంటింటి ప్రచారంలో ఆయన మాట్లాడుతూ టిడిపి సూపర్ సిక్స్ పథకాలను ఓటర్లకు వివరించారు. వైసిపి నాయకులు ల్యాండ్, ఇసుక, మైనింగ్, గంజాయి, రేషన్ బియ్యం అక్రమ రవాణాతో కోట్లు ఆర్జించారని ఆరోపించారు. కల్తీ మద్యం విక్రయించి రాష్ట్రంలో మందు బాబులు ఆరోగ్యాలను పాడు చేసి అనేక కుంటుంబాలను రోడ్డున పడేశారన్నారు. మద్యపాన నిషేధం చేశాకే ఓట్లు అడుగుతానని జగన్ మాట ఇచ్చి నేరుగా ప్రభుత్వమే మద్యం అమ్మి ప్రజా ధనం దోచుకోవడం దారుణమన్నారు. వైసిపి మ్యానిఫెస్టో హామీలు 99 శాతం అమలు చేశామని జగన్ అబద్ధాలు చెబుతూ ప్రజలను మోసం చేస్తున్నాడని మండిపడ్డారు. ఇసుక ధరలు నాలుగు రెట్లు పెంచి భవన నిర్మాణ కార్మికులు 40 లక్షల మంది కడుపు కొట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పది సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై భారం మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గ ప్రజలు ప్రతి ఒక్కరూ బాధ్యతతో కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ముని చంద్రారెడ్డి , జనసేన మండల అధ్యక్షుడు బాష, టిడిపి మండల నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

టిడిపి హయాంలోనే గ్రామాల అభివృద్ధి

- టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పాశిం సునీల్ కుమార్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : చిల్లకూరు మండల పరిధిలోని ముత్యాలపాడు, నాంచారం పేట గ్రామాల్లో టీడీపి ఎమ్మెల్యే అభ్యర్థి పాశిం సునీల్ కుమార్ సోమవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ముత్యాలపాడు పంచాయతీ టీడీపి నాయకులు ప్రవీణ్ రెడ్డి , శ్రీధర్ రెడ్డి , సర్పంచ్ శనగ హరిత పాశిం సునీల్ కుమార్‌ను శాలువా కప్పి గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపి హయంలోనే గ్రామాల అభివృద్ధి జరిగిందన్నారు. వైసిపి హయాంలో అభివృద్ధి శూన్యం అన్నారు. చంద్రన్న పాలన లోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు . వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఎన్‌డిఏ కూటమికి ఓటు వేసి గెలిపించాలన్నారు. గూడూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో నాయ కులు ఎల్లసిరి శ్రీనివాసులు రెడ్డి , బీజేపీ నాయ కులు కిరణ్ కుమార్ రెడ్డి , స్థానికులు పాల్గొన్నారు.

నేడు డక్కిలి మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశకి-డక్కిలి: దక్కిలి మండలం సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ జి రాజశేఖర్ అధ్యక్షతన నిర్వహించ నున్నట్లు ఎంపీడీవో ఏం లీల మాధవి సోమవారం తెలిపారు. మండల పరిషత్ కార్యాల యంలో నిర్వహించే ఈ సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, అన్ని గ్రామ పంచాయతీల సర్పంచ్ లు, వివిధ ప్రజాప్రతినిధులు మండల స్థాయి అధికారులు హాజరుకావాలని తెలిపారు.

వైసిపితోనే రాష్ట్రాభివృద్ధి : రాజేష్

ప్రజాశక్తి - పిచ్చా టూరు: పిచ్చాటూరు మండలం కీళపూడి, నీరువాయి గ్రామాల్లో ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్ సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం సుపరిపాలన సాధ్యమవుతుందని ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక టిడిపి జనసేన నాయకులు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు.

వెంకటగిరి అసెంబ్లీ పరిధిలో అభ్యర్థులు వీరే..

ప్రజాశక్తి -వెంకటగిరి: సాధారణ ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో భాగంగా నామినేషన్ల ఉపసంహరణ గడువు సోమవారం ముగిసింది. వెంకటగిరి శాసనసభ స్థానానికి మొత్తం పది మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. వీరిలో టిడిపి తరపున కురుగొండ్ల రామకృష్ణ అభ్యర్థిగా నిలవగా ఆయనకు సైకిల్ గుర్తు కేటాయించారు. యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ (వైసిపి) అభ్యర్థిగా నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి కి సీలింగ్ ఫ్యాన్ గుర్తును కేటాయించారు. బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థిగా పేరాలజీ చంద్ర (ఏనుగు), భారత జాతీయ కాంగ్రెస్ అభ్యర్థిగా పంట శ్రీనివాసులురెడ్డి(హస్తం), నీతి నిజాయితీ పార్టీ అభ్యర్థిగా ఎస్ నాగరాజు (కొబ్బరి తోట), జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థి ముప్పాళ్ళ శ్రీరామరాజుకు బ్యాటరీ టార్చి గుర్తు కేటాయించారు. భారత చైతన్య యువజన పార్టీ అభ్యర్థి సిహెచ్. శివకృష్ణ కు (గన్నా కిసాన్), రాడికల్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థి పిక్ షఫీ కి (ఉంగరం), స్వతంత్ర అభ్యర్థి ఆర్ముగన్.వి కి పలక, మరో స్వతంత్ర అభ్యర్థి సిహెచ్ వెంకటాచలపతికి ఆటో రిక్షా గుర్తును ఎన్నికల అధికారి కేటాయించారు.

బ్యాంకు ఖాతాల ద్వారా పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి - కోట : మే 1వ తేదీ నుండి పింఛన్లను బ్యాంకు ఖాతాల ద్వారా అందిస్తామని కోట ఎంపీడీవో శంకరయ్య అన్నారు. సోమవారం కోట మండలంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున రాబోవు రెండు నెలలకు పింఛన్ పంపిణీ రెండు పద్ధతుల్లో ఉంటుందన్నారు. మండలం లోని కొంతమంది పెన్షన్ దారులకు పెన్షన్ నగదును డిబిటి ద్వారా నేరుగా వారి బ్యాంకు అకౌంట్‌కు జమ చేస్తామన్నారు. మిగిలిన వారికి సచివాలయ సిబ్బంది ఇంటికి వెళ్లి ఇస్తామని తెలిపారు. దాదాపు 75 శాతం మందికి వారి అకౌంట్‌కి బదిలీ చేస్తామని పేర్కొన్నారు.

గంగమ్మ సేవలో మాజీ మంత్రి


గంగమ్మ సేవలో మాజీ మంత్రి

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని పెద్ద చల్లారి గుంట పంచాయతీ శ్రీ కామదొడ్డి గంగమ్మ జాతరలో మాజీ మంత్రి అమర్నాథ్ రెడ్డి ఆదివారం రాత్రి పాల్గొన్నారు. బైరెడ్డిపల్లి మండల టీడీపీ నాయకులతో కలిసి ఆయన అమ్మవారిని దర్శించుకున్నారు. జాతర నిర్వాహకులు ఆయనకు తీర్థప్రసాదాలను అందించి సన్మానించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కిషోర్ గౌడ, ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం శెట్టి పలువురు పాల్గొన్నారు.

మళ్లీ జగన్ వస్తేనే ప్రజలకు మేలు: ఎంపీపీ


ఎన్నికల ప్రచారంలో ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో సారి అధికారంలోకి వస్తేనే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమల్లో ఉంటాయని బైరెడ్డిపల్లి ఎంపీపీ రెడ్డెప్ప అన్నారు. సోమవారం మండలంలోని గొల్లచీమలపల్లి పంచాయతీలో సర్పంచ్ రూన్సీ నాగభూషణ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ తాజాగా వైసీపీ ప్రకటించిన మ్యానిఫెస్టో ప్రజలందరికీ మరింత మేలు జరిగేలా ఉందని స్పష్టం చేశారు. ప్రజలందరూ వైసీపీకి మరో అవకాశం ఇచ్చి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో డీసీసీబీ బ్యాంకు ఛైర్మన్ రెడ్డెమ్మ, రాజంపేట నియోజకవర్గం అబ్జర్వర్ యం.కృష్ణమూర్తి, జెడ్పిటిసి కేశవులు, వైస్ ఎంపీపీలు రూపా జయకుమార్, నారాయణస్వామి, మండల యూత్ ప్రెసిడెంట్ మహేష్, మండల సచివాలయ కన్వీనర్ కార్తికేయ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరికీ మేలు చేస్తా: పద్మనాభం


పద్మనాభం

ప్రజాశక్తి-వెదురుకుప్పం: తనను గెలిపిస్తే నిజాయితీగా ప్రజలందరికీ మేలు చేస్తానని స్వతంత్ర అభ్యర్థి పద్మనాభం స్పష్టం చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిస్వార్థంగా ప్రజలందరి శ్రేయస్సుకోసం పాటుపడతానని, ఓటర్లు ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. జీడీ నెల్లూరు నియోజకవర్గ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. బుట్ట గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు.

'టీడీపీతోనే రైతాంగానికి సాయం'



ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మండలంలో టిడిపి శ్రేణులు విస్తృత ప్రచారం నిర్వహించారు. సోమవారం వెంగంవారిపల్లి పంచాయతీ పరిధిలో మాజీ ఎంపీపీ డాక్టర్ కృష్ణవేణి జైకుమార్ గౌడ, టిడిపి పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సుబ్రమణ్యంశెట్టి, మాజీ సర్పంచ్ శంకరప్ప ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి సైకిల్ గుర్తుకు ఓటేయాని అభ్యర్థించారు. ఎమ్మెల్యేగా అమరనాథ్‌రెడ్డి, ఎంపీగా ప్రసాదరావును గెలిపించుకొంటే అభివృద్ధి చేసి చూపిస్తారని ప్రజలందరూ ఆలోచన చేసి టీడీపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. నాయకులు సాయిగౌడ, సాయిప్రతాప్ గౌడ, శంకరప్ప, నారాయణరెడ్డి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఆ పల్లెకు దాహపు ఎక్కిళ్లు

- మరమ్మతుకు నోచుకోని తాగునీటి బోర్లు
- నీటి కోసం మహిళలు అగచాట్లు

ప్రజాశక్తి-గంగవరం: మండలంలోని కీలపట్ల పంచాయతీ దళితవాడలో ఆరు నెలలుగా తాగునీరు లేకపోవడంతో మహిళలకు ఇబ్బందులు గురవుతున్నట్లు విచారం వ్యక్తం చేశారు. గ్రామంలో తాగునీటి బోర్లు ఉన్న స్థానిక సర్పంచి మరమ్మతులు చేయకపోవడంతో ఇబ్బంది ఏర్పడిందని గ్రామస్తులు తెలిపారు. కూలి పనులు వదులుకుని తాగునీటి కోసం వ్యవసాయ బావుల వద్ద నీళ్ల తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని మహిళలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ప్రయోజనం లేకపోయిందని వాపోయారు. ఉన్నతాధికారులైనా పట్టించుకోని సమస్యను తీర్చాలని కోరారు.

ఘనంగా ఎమ్మెల్సీ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-గుడిపల్లి: ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పుట్టిన రోజు వేడుకలను తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ హాస్పిటల్‌లో ఆయన చేతుల మీదుగా రోగులకు పాలు, బ్రెడ్, పండ్లను పంపిణీ చేశారు. అదేవిధంగా కుప్పం నియోజకవర్గంలోని గుడిపల్లి, శాంతిపురం, రామకుప్పం, కుప్పం మండలాల్లో అన్నదాన కార్యక్రమం నిర్వహించి ఆయనకు ఘనంగా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గంలో పుట్టిన రోజు జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని ఈ నియోజకవర్గంలోని ప్రజల ఆదరణ ఆప్యాయత, ఎన్నటికీ మరిచిపోనిని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.


రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

వైభవంగా ప్రారంభమైన వసంతోత్సవాలు


పురవీధుల్లో ఊరేగుతున్న రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలుడు

ప్రజాశక్తి-కార్వేటినగరం: రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో సోమవారం వసంతోత్సవాలను టీటీడీ ఆధ్వర్యంలో వైభవంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి శుద్ధి తోమాల, పంచాగ్రశ్రవణం వంటి నిత్య కైంకర్యాలను నిర్వహించారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మధ్యాహ్నం 2.30నుంచి 3.30గంటల నడుమ ఉత్సవ మూర్తులకు వేద పండితులు వేద మంత్రాల నడుమ స్నపనతిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ సమర్పణ చేపట్టారు. అనంతరం అలంకార మండపానికి స్వామి వార్లను వేంచేసి పట్టువస్త్ర, సుగంధభరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో సుందరంగా అలంకరించి తిరుచివాహనంపై ప్రతిష్ఠించి గ్రామ వీధుల్లో మంగళవాయిద్యాల నడుమ అంగరంగ వైభవంగా ఊరేగించారు. భక్తులు ఇంటింటా కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి 8.45గంటలకు వేద పండితులు స్వామివారిని జోల పాటలతో ఏకాంత సేవ నిర్వహించి పవళింప చేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారి సురేష్‌కుమార్ వేదపండితులు గోపాలాచారి, టీటీడీ సిబ్బంది భక్తులు పలువురు పాల్గొన్నారు.

వైసీపీని మళ్లీ గెలిపించండి: శ్రీనివాసులు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి అభివృద్ధి ప్రదాత, ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి మళ్లీ ఎమ్మెల్యేగా గెలిపించుకుందామని శ్రీకాళహస్తీశ్వరాలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు పిలుపునిచ్చారు. పట్టణంలోని 18, 22 వార్డుల్లో సోమవారం అంజూరు శ్రీనివాసులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సంక్షేమ నవరత్న పథకాలు గడపగడపకు అందాయా లేదా అని అరా తీశారు. గతంలో కంటే కూడా రెట్టింపు మెజార్టీతో బియ్యపు మధుసూదన్ రెడ్డిని విజయం సాధించే విధంగా ప్రజలు ఓట్లు వేయాలని సూచించారు.తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చిర్రి నాగేశ్వరరావు, స్వర్ణ మూర్తి, పగడాల రాజు, జబ్బార్ బాయ్, షఫీ, శివ యాదవ్, ఉత్తరాది శరవణ కుమార్, మొగరాల గణేష్, కొల్లూరు హరినాథ్ నాయుడు, చింతామణి పాండు, శ్రీవారి సురేష్, పుట్టం రాజా ముదిరాజ్, శంకర్, ఆవుల శ్రీనివాసులు, పసల కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

పలమనేరులో 21నుంచి గంగ జాతర

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు లో అంగరంగ వైభవంగా జరిగే గంగ జాతర మే 21న నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సోమవారం ఆలయం వద్ద సమావేశమై తేదీని ఖరారు చేశారు. ఈ దఫా ఎన్నికలు కావడంతో చరిత్రలో తొలిసారి జాతర ఆలస్యం అయిందని ఈ సందర్భంగా వారు తెలిపారు.

యువతకు క్రికెట్ కిట్టు బహూకరణ



ప్రజాశక్తి-కోట: గూడపాకల రామమ్మ జ్ఞాపకార్థం ఆమె తనయుడు గూడపాకల సుబ్బారావు కోట మండలం శ్యామసుందరపురం కాలనీలోని యువత కోరిక మేరకు సోమవారం క్రికెట్ కిట్టును యువతకు బహూకరించారు. ఈ సందర్భంగా గూడపాకల సుబ్బారావు మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడలలో కూడా రాణించాలని అన్నారు. యువతకు క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు, ఆరోగ్య పరిరక్షణకు దోహదం చేస్తాయని, క్రీడల వల్ల దేహదారుఢ్యం, స్నేహభావం పెంపొందుతుందని పేర్కొన్నారు. యువత దేశానికి వెన్నెముక లాంటివారని, ప్రతి ఒక్క క్రీడలలో యువత రాణించాలని అన్నారు. కార్యక్రమంలో శ్యామసుందరపురం కాలనీ యువత పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటు వేయండి: ఎంపీపీ


ఇంటింటి ప్రచారంలో ఎంపీపీ లతబాలాజీ

ప్రజాశక్తి-కార్వేటినగరం: మండల పరిధిలోని ఎంఎం విలాసం, ఎన్ ఆర్ కండిగా గ్రామాలలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి కుమార్తె ప్రగతి గాంధీ, ఎంపీపీ లతబాలాజీ, మండల కన్వీనర్ శేఖర్‌రాజు ఆధ్వర్యంలో సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ డిప్యూటీ సీఎం నారాయణస్వామి మండలాన్ని ఎంతో అభివృద్ధి చేశారని, అభివృద్ధిని చూసి ఓట్లు వేయాలని ఓటర్లను కోరారు. అదేవిధంగా చిత్తూరు ఎంపీ అభ్యర్థి రెడ్డప్పకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఓటర్లను ఆప్యాయంగా పలకరించి ప్రచారం నిర్వహించారు. సీఎం జగన్ ఎన్నో సంక్షేమ పథకాలు అందించారన్నారు. కార్యక్రమంలో మాజీ మండల కన్వీనర్ ధనంజయ వర్మ, నాయకులు వర్మపవన్, దేశమ్మ, చంద్రశేఖర్ రాజు, మురళి, ఆనంద్, శివ తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 112మందికి ఉద్యోగాలు



నియామక పత్రాలు అందిస్తున్న ప్రిన్సిపల్

ప్రజాశక్తి-శాంతిపురం: మండలంలోని ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళాలో 112మందికి ఉద్యోగ అవకాశాలు పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ జి.నగేష్ తెలిపారు. ఐటిఐలో ద్వితీయ సంవత్సరం శిక్షణ పొందుతున్న వారు, శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 27న ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా శ్రీసిటీ హవేలేస్ కంపెనీకి 20మంది, బెంగళూరుకు చెందిన ఆఫెన్ ఆల్ కంపెనీకి 30మంది, నాయుడుపేట గ్రీన్ టెక్ కంపెనీకి 27మంది, చెన్నై అమరరాజా కంపెనీకి 15మంది, శ్రీసిటీ బ్రిక్స్ ఇండియా కంపెనీకి 20మంది మొత్తం 112మంది ఎంపిక కాగా వీరందరికి ప్రిన్సిపాల్ నగేష్ చేతుల మీదుగా ప్లేస్మెంట్ లెటర్లను అందించారు.

టీడీపీ ఇంటింటి ప్రచారం


ఇంటింటి ప్రచారంలో టీడీపీ నాయకులు

ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలోని దిగువ పల్లాలు పంచాయతీలో టీడీపీ శ్రేణులు సోమవారం ఎన్నిక ప్రచారాన్ని చేపట్టారు. ఇంటింటికి వెళ్లి ఎమ్మెల్యే అభ్యర్థి థామస్, ఎంపీ అభ్యర్థి ప్రసాద్ రావును గెలిపించాలని అభ్యర్థించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు లోకనాథ్ రెడ్డి, మోహన్ మురళి, చంగల్రాయిరెడ్డి, సుధాకరరెడ్డి, వెంకటరమణారెడ్డి, బాలజిరెడ్డి, నాగిరెడ్డి, సుధకర్, రామయ్య, గోవిందస్వామి, బాబు తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించండి: సుధాకర్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించుకుదామని ప్రముఖ టీవీ సీరియల్ నిర్మాత పల్లమాల సుధాకర్ పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం రేణిగుంట మండలానికి చెందిన కాపు నేత, రైస్ అసోసియేషన్ అధినేత రామకృష్ణని కలిసి ఎన్డిఏ కూటమికి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే అభ్యర్థిగా బొజ్జల వెంకట సుధీర్ రెడ్డిని, ఎంపీ అభ్యర్థి వరప్రసాద్ కి మద్దతుగా నిలిచి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పల్లమాల శశాంక్, బీజే ప్రసాద్, కులదీప్ తదితరులు పాల్గొన్నారు.

బిజెపితో తస్మాత్ జాగ్రత్త: రాకేష్ రెడ్డి

ఎన్నికల బరిలో 15 మంది

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల బరిలో 15 మంది అభ్యర్థులు నిలిచారు. నామినేషన్ల పరిశీలన నాటికి 27 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. వీరిలో 12 మంది అభ్యర్థులు సోమవారం తమ అభ్యర్థిత్వాన్ని ఉపసంహరించుకున్నారు. ఇక బరిలో ఉన్న వారిలో సిట్టింగ్ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి(వైసీపీ), బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి(టీడీపీ), పోతు గుంట రాజేష్ నాయుడు(కాంగ్రెస్), కే సురేంద్రబాబు(బీఎస్పీ), కె దినద్ బాబు(బీసీవై పార్టీ), జీ. రమేష్(ఎన్జే పార్టీ), గోవిందస్వామి (సమాజ్వాది పార్టీ), ఆర్ నిరంజన్ రెడ్డి(జేబీఎన్ పార్టీ), ఏ పావని(పిరమిడ్ పార్టీ), పులి పుష్పలత(వీసీకే పార్టీ) లు ఉన్నారు. చుక్కల ఎల్లయ్య, చిరంజీవి, శ్రీనివాసులు రెడ్డి, పేరం నాగరాజు నాయుడు, తీగల భాస్కర్ లు ఇండిపెండెంట్లుగా బరిలో ఉన్నారు.





పుత్తూరులో ప్రచారం నిర్వహిస్తున్న రాకేష్‌రెడ్డి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : బిజెపితో తస్మాత్ జాగ్రత్త అని నగరి నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి పోచారం రాకేష్ రెడ్డి హెచ్చరించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నగరి నియోజవర్గం పుత్తూరు మండలంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు కేశవులు ఆధ్వర్యంలో అడవి కండ్రిగ, తిరుమల కుప్పం, కృష్ణ సముద్రం, కైలాసపురం, వేపగుంట, పరమేశ్వరమంగళం, ఎగువ కనకపాలెం, తడుకు ప్రాంతాలలో ఇండియా కూటమి ఉమ్మడి అభ్యర్థి రాకేష్ రెడ్డి సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామాలలో ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ పథకాలు వివరిస్తూ బిజెపి తో తస్మాత్ జాగ్రత్త అని, బిజెపితో దేశానికి మతపరంగా, వ్యాపార పరంగా, అభివృద్ధి పరంగా ప్రమాదంలో ఉందన్నారు. ప్రతి బాధ్యత గల పౌరుడు బిజెపి నుంచి దేశాన్ని, అమాయకులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. రాబోయే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్‌ని భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో పిసిసి జనరల్ సెక్రెటరీ ఆర్ బాబు, డిసిసి జనరల్ సెక్రటరీలు ఢిల్లీ, చిరంజీవి రెడ్డి, ఎస్‌సి నాయకులు రత్నం, పుత్తూరు మున్సిపల్ కాంగ్రెస్ ప్రసిడెంట్ లోహితరాజు, నగరి మండల కాంగ్రెస్ ప్రసిడెంట్ కుమార్, మున్సిపల్ కాంగ్రెస్ వైస్ ప్రసిడెంట్ రజనీదేశప్ప, దివాకర్, సుమన్, వెంకటేష్, మహేష్, హరీష్, ప్రభాకర్, చిన్ని, సతీష్ , రాజా, దేవ, విజయ్ పాల్గొన్నారు.

వెంకటగిరి: ఇండియా వేదిక నుండి బరిలో నిలిచిన కాంగ్రెస్ అభ్యర్థి పంట శ్రీనివాసరెడ్డిని గెలిపించాలని సిపిఐ నాయకులు విజ్ఞప్తి చేశారు. సోమవారం వెంకటగిరిలో ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ దేశాన్ని మతోన్మాదుల చేతుల నుండి కాపాడుకోవాలంటే కాపాడుకోవాలంటే కాంగ్రెస్ రావాలన్నారు. రోజురోజుకూ పెరుగుతున్న నిరుద్యోగాన్ని బిజెపి ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు పల్లిపాటి బాలకృష్ణయ్య, శివ, పాల్గొన్నారు.

గూడూరు టౌన్: ఇండియా వేదిక అభ్యర్థులైన సిపిఎం నెల్లూరు సిటీ నియోజకవర్గ అభ్యర్థి మూలం రమేష్ ని, సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని సిపిఎం నాయకులు కోరారు. సోమవారం నెల్లూరు లోని కనకమహాల్ సెంటర్, సుబేదారు పేట, ఆర్.ఆర్ స్ట్రీట్, నర్తకి సెంటర్, ట్రంక్ రోడ్, జొన్నలగడ్డ వారి వీధి, తదితర ప్రాంతాల్లో విస్తృత ప్రచారం చేశారు. ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి ఎంపి కొప్పుల రాజు కి హస్తం గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలన్నారు.ఈ కార్యక్రమంలో గూడూరు సిపిఎం శాఖ కార్యదర్శి జోగి శివకుమార్, గూడూరు పట్టణ సిఐటియు అధ్యక్షులు బివి రమణయ్య, సీనియర్ నాయకులు బి చంద్రయ్య, కె మాధవరావు పాల్గొన్నారు.



వెంకటగిరిలో

చిత్తూరు అర్బన్: చిత్తూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి టిక్కీ రాయల్ గంగనపల్లి, జానకారపల్లిలో సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా టిక్కీ రాయల్ మాట్లాడుతూ కాంగ్రెస్‌తోనే దేశ అభివృద్ధి సాధ్యమవు తుందన్నారు. ఆర్థికంగా పురోభివృద్ధి ఉంటుందని, పేద, బడుగు, బలహీన వర్గాలకు మేలు జరుగుతుందన్నారు. మైనారిటీలపై దాడులను అరికట్టవచ్చని తెలిపారు. రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి అయిన వెంటనే మొదటి సంతకం ఆంధ్రప్రదేశ్ కు 10 సంవత్సరాల గ్యారెంటీతో ప్రత్యేక హోదా ఇస్తారని, తద్వారా పరిశ్రమలు వచ్చి ఉపాధి పెరుగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం కాంగ్రెస్‌కి ఓటు వేసి గెలిపించాలని ప్రతి ఇంటికి తిరిగి ప్రచారం చేశారు.
ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉదయ్ కుమార్, మధు కుమార్, సుమంత్, ఐజాక్ బాబు, సురేష్, సుబ్బయ్య, ధనలక్ష్మి చక్రం చందన పాల్గొన్నారు.

బహుభాషా కోవిదుడు, సహజ, కర్షక కవి దువ్వూరి రామిరెడ్డి..

ప్రజాశక్తి - క్యాంపస్ : బహుభాషా కోవిదుడు, సహజ కవి, కర్షక కవి దువ్వూరి రామిరెడ్డి అని పలువురు వక్తలు ప్రశంసించారు. తెలుగు అధ్యయన శాఖలో తెలుగు సాహితీ సమితి ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇన్‌ఛార్జి తెలుగు శాఖాధ్యక్షులు డాక్టరు వై సుభాషిణి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాహితీ సమితి కార్యక్రమాలు పిల్లలకు సాహిత్యం పట్ల ఇష్టాన్ని పెంపొందించడం,పెద్దల నుంచి నేర్చుకున్న విషయాలను రేపటి తరాలకు అందించాలనే ధ్యేయం శాఖలో కొనసాగుతోందన్నారు. ఈ కార్యక్రమానికి వక్తగా శ్రీవేంకటేశ్వర ప్రాచ్య కళాశాలలో అధ్యాపకులుగా పనిచేస్తున్న డాక్టరు కొణిదెల పురుషోత్తం విచ్చేశారు. వారు 'కర్షక వ్యాస కర్త'– దువ్వూరి రామిరెడ్డి ' అనే అంశంపై మాట్లాడుతూ కృషీవలుడైన దువ్వూరి రామిరెడ్డి మనిషికి కృషి ఎంత అవసరమో వర్ణించిన తీరును మన ముందుంచారు. రైతులను సైనికులతో పోల్చాడంటే వారి అవసరం నేటి సమాజానికి ఎంత అవసరమో మనం గ్రహించుకో వచ్చన్నారు. వీరి కవిత్వంలో వ్యవసాయ ఆధారంగా జీవించే వ్యక్తుల, కుటుంబాల గురించి విశ్లేషించారు. దువ్వూరి అపారమైన జ్ఞాని, బహుభాషా కోవిదుడు, సహజ కవి, కర్షక కవి అని చెప్పారు. తెలుగు సాహిత్యంలో వీరి సాహిత్యం నవనవోన్మేషణమై నలుదిశలా వెలుగులు ప్రసరించిందని పేర్కొన్నారు. తెలుగు సాహితీ సమితి కార్యక్రమానికి సలహా దారుగా వ్యవహరించిన డాక్టరు డి యువశ్రీ మాట్లాడుతూ తెలుగు భాష ఔన్నత్యాన్ని తెలుపుతూ తెలుగు అధ్యయన శాఖలో 1994 నుంచి నేటికీ కూడా సాహితీ సమితి కార్యక్రమాలు నిర్విఘ్నంగా ముందుకు సాగుతు న్నాయ న్నారు. సాహితీ సమితి కార్యక్రమానికి మంచి స్ఫూర్తి ప్రదాతలను పిలిపించి వారితో సందేశం ఇప్పించడం ఆనంద దాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి కార్యవర్గ సభ్యులు గా అధ్యక్షులు కె. తేజేశ్వరి, ఉపాధ్యక్షులు పి.సుమాం జలి, కార్యదర్శి ఎస్. గీతాంజలి, కోశాధికారి జి.మధు యామిని, డా.ఎన్.గౌరీ, ఎంఏ విద్యార్థులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువులు వితరణ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: మాతృస్య అనాథ వృద్ధాశ్రమానికి రిటైర్డ్ టిటిడి డీఈవో ఓ దేశాది రెండవ వర్థంతిని పురస్కరించుకొని రూ. 15 వేలు విలువచేసే బియ్యం, పప్పులు నిత్యావసర వస్తువులను ఆయన కుమారుడు ఓ వి ఎస్ ప్రసాద్ అందించారు. ఆశ్రమానికి 15 రోజులకు సరిపడే నిత్యావసర వస్తువులను అందించామని ఓవిఎస్ ప్రసాద్ తెలిపారు. ప్రతి ఏటా తండ్రి జయంతి, వర్థంతులను పురస్కరించుకొని అనాథలను ఆదుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓవిఎస్ ప్రసాద్‌తో పాటు కుటుంబ సభ్యులు, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేస్తున్న ఎన్నికల అబ్జర్వర్ ఉజ్వల్ కుమార్ ఘోష్

పోలింగ్ కేంద్రాల తనిఖీ

ప్రజాశక్తి - పిచ్చాటూరు: పిచ్చాటూరు మండలంలో పిచ్చాటూరు పోలింగ్ కేంద్రాలను తిరుపతి పార్లమెంటరీ జనరల్ అబ్జర్వర్ ఉజ్వల్ కుమార్ ఘోష్ సోమవారం తనిఖీ చేశారు. డిఎస్‌పి శ్రీనివాసరావు, పిచ్చాటూరు మండల తమశీల్దారు హుస్సేన్ సాహెబ్, ఎస్ ఓ సంజీవరెడ్డి, ఎస్ఐ వెంకటేశ్వర్లు, వీఆర్వోలు ప్రియాంక, సెల్వం, కంప్యూటర్ ఆపరేటర్ ఆకాష్, బిఎల్‌వోలు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

రూ.కోటి విలువైన ఎర్రచందనం స్వాధీనం

- వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): కడప ఫారెస్ట్ డివిజన్ లోని పోరుమామిళ్ల అటవీ ప్రాంతంలో 101 ఎర్రచందనం దుంగలు, ఒక మినీ లారీ, రెండు మోటార్ సైకిల్, ఒక స్మగ్లరును అరెస్టు చేసినట్లు టాస్క్ ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డిఎస్‌పి చెంచుబాబుకు అందిన సమాచారంతో ఆర్ఐ చిరంజీవి, ఆర్ఎస్ఐలు మురళీధర్ రెడ్డి, నరేష్ బృందాలు కడప అటవీ ప్రాంతం పోరుమామిళ్ల రేంజి మల్లెపల్లి సెక్షన్ ఇటుకులపల్లి అటవీ పరిధిలో చందనాల బోరు నుండి కూంబింగ్ చేపట్టారన్నారు. సమీపంలోని ఎర్రబావి చెరువు వద్ద ఎర్రచందనం దుంగలను అక్రమ రవాణా చేయడానికి సిద్ధంగా వుంచిన మినీ లారీని గుర్తించామన్నారు. వెంటనే టాస్క్ ఫోర్స్ బృందం లారీని సమీపిస్తుండగా స్మగ్లర్లు పారిపోవడానికి యత్నించారన్నారు. పారిపోతున్న స్మగ్లర్లు కడప జిల్లా ముదిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన అంకయ్యను అదుపులోకి తీసుకున్నామన్నారు. అక్రమంగా తరలించడానికి ఉంచిన 101 ఎర్రచందనం దుంగలను, టాటా గూడ్స్ క్యారియర్, రెండు మోటార్ సైకిల్ లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగల బరువు 2,959 కేజీలు ఉందని బహిరంగ మార్కెట్లో కోటి రూపాయలు ఉండొచ్చని అధికారులు అంచనా వేశారు. పారిపోయిన స్మగ్లర్ల కోసం గాలింపు చర్యలు చేపట్టామని అధికారులు తెలిపారు. చాకచక్యంగా వ్యవహరించి పెద్ద మొత్తంలో ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్న టాస్క్ ఫోర్స్ సిబ్బందిని ఎస్పీ సత్కరించి రివార్డులు అందించారు. కాగా కోటి రూపాయలు విలువైన ఎర్రచందనం తిరుపతి టాస్క్ ఫోర్స్ కేంద్ర కార్యాలయానికి తీసుకు వస్తున్న సమయంలో వాహనం మరమ్మతులకు గురికావడంతో మార్గమధ్యంలోనే పోలీసులు వాహనానికి కాపలా ఉంటూ మరమ్మతులు చేయిస్తున్నట్టుగా సమాచారం. ఈ సమావేశంలో టాస్క్ ఫోర్స్ ఏఎస్పి శ్రీనివాస్, ఆర్ ఐలు చిరంజీవి, సురేష్ కుమార్ రెడ్డి, సీఐ సురేష్ కుమార్, ఆర్ఎస్ఐ వినోద్ కుమార్ రెడ్డి, ఎస్ఐ రఫీ పాల్గొన్నారు.



పోలీసుల అదుపులో ఎర్రచందనం స్మగ్లర్

వైసిపి దాడులపై ఎస్‌పికి ఆరణి ఫిర్యాదు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: ఎన్నికల ప్రచారంలో వైసీపీ నాయకులు దాడులపై ఎన్‌డిఎ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు జిల్లా ఎస్పీ కృష్ణ కాంత్ పటేల్ ను కలిసి ఫిర్యాదు చేశారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీని కలిసిన ఆయన మీడియాతో మాట్లాడుతూ గత వారం రోజులుగా ఎన్నికల ప్రచారాన్ని వైసిపి అల్లరి మూకలు అడ్డుకుంటున్నాయి. కూటమి నేతలపై దాడులు చేస్తున్నా పోలీసులు కేసులు నమోదు చేయడం లేదు. దొడ్డాపురం వీధి , గిరిపురం, అనంతవీధి, సరోజినీదేవి రోడ్డులలో మా కార్యకర్తలను వైసిపి నేతలు దారుణంగా కొట్టారని తెలిపారు. ఫొటోలు, వీడియోలు ఆధారంగా దాడి చేసిన వైసీపీ కార్యకర్తలను గుర్తించి కేసులు నమోదు చేయాలని కోరారు. భూమన కరుణాకర్ రెడ్డి పులివెందుల నుంచి రౌడీలను తీసుకొచ్చారు. పులివెందుల రౌడీలు తిరుపతి నగరంలో తిరుగుతున్నారని విమర్శించారు. వేల కోట్లు అక్రమ ఆస్తులను కరుణాకర్ రెడ్డి ఎలా కూడబెట్టారో ప్రజలకు చెప్పాలన్నారు. మార్పు కోసం యుద్ధం చేయాల్సి వస్తే 99సార్లు శాంతియుతంగా ప్రయత్నిస్తాం..వందో సారి అసలైన యుద్ధం చేస్తాం అంటూ పవన్ కళ్యాణ్ నినాదాన్ని వెల్లడించారు. మరోసారి వైసిపి అల్లరి మూకలు దాడికి దిగితే ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. ఎస్పి స్పందించి దాడికి పాల్పడుతున్న వైసీపీ అల్లరి మూకలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, నరసింహ యాదవ్, డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, దంపూరి భాస్కర్, వుకా విజయ్ కుమార్ పాల్గొన్నారు.



తిరుపతి ఎస్‌పి కృష్ణకాంత్ పటేల్‌కు ఫిర్యాదు చేస్తున్న టిడిపి కూటమి నాయకులు